## రిపోర్టర్లు కావలెను

ఎప్పటికప్పుడు వాస్తవ కథనాలను అందిస్తూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన 'తొలి ఆకాంక్ష' దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పని చేయడానికి జిల్లాల వారిగా బ్యూరోలు, నియోజకవర్గాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, మండల వారిగా కంట్రిబ్యూటర్లు కావలెను.

సెల్ :8333818121.9908333465

మీ బయోడేటా పై నంబర్లకి వాట్సాప్ ద్వారా పంపగలరు



# తొలి ఆకాంక్ష

TGTEL/25/A1964

akankshanews.com

తెలుగు సంచలన దిన పత్రిక



## రిపోర్టర్లు కావలెను

సామాన్యుడికి అండగా,ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా నూతనంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,సూర్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాలో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు | మండల | నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number : 9908333465.8333818121



ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 68 ఎడిటర్ :పెనుగొండ సతీష్ బుధవారం 15 అక్టోబర్ 2025 పేజీలు 8 వెల 5.00


### విశాఖలో
# గూగుల్ సెంటర్

- వికసిత భారత్ లక్ష్యాలకు తార్కాణం
- సుందర్ పిచాయ్‌కు మోడీ అభినందనలు



(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ సెంటర్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన చారిత్రక ఒప్పందంపై మోదీతో ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పిచాయ్ చేసిన పోస్ట్‌కు ప్రధాని బదులిచ్చారు. గిగా సెంటర్ ఏర్పాటు వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. ఈ ఏఐ హబ్ బలమైన శక్తిగా పనిచేస్తుంది.

2 లో



## మాగంటి సునీతకు
# బిఫామ్ అందించిన కెసిఆర్

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబరు 14 : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన మాగంటి సునీతా గోపీనాథ్ కు పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫామ్ అందజేశారు. అదేవిధంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరపున రూ. 40 లక్షల చెక్కును కూడా అందించారు. ఈ సందర్భంగా మాగంటి సునీతా గోపినాథ్ వెంట ఆమె కూతుళ్లు, కుమారుడు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు తదితరలు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక జరుగుతున్నది. ఈ సందర్భంగా కెసిఆర్ వారిని ఆశీర్వదించారు.

### సుప్రీంలో అనుకున్న
# తీర్పు రావచ్చు

- హైకోర్టు తీర్పు తమకు నిరాశ కలిగించింది
- ఎస్‌ఎల్‌పి విచారణ రేపు వచ్చే ఛాన్స్
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ వెల్లడి



(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, అక్టోబర్14 :పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎల్‌పీ గురువారం నాడు విచారణకు వస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు అన్ని పార్టీలు మద్దతిచ్చాయని, ఇప్పుడు మాట మారుస్తున్నాయని అన్నారు. ఇదిలావుంటే బీసీ

2 లో

### తుమ్మల, పొన్నంలకు
# మానవత్వం ఉందా

- మాగంటి సునీతను అవమాన పరుస్తారా
- మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస గౌడ్



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 14 : మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్‌లకు మానవత్వం ఉందా? వాళ్లు మనుషులేనా? అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఆడబిడ్డ అయిన మాగంటి సునీతను అవమానించడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గోపన్న అమర్ రహే అంటుంటే, తన భర్త గోపినాథ్‌ను గుర్తు చేసుకొని మాగంటి సునీత ఏడుస్తుంటే డ్రామా అంటారా తుమ్మల నాగేశ్వరరావు? కమ్మ సామాజిక వర్గం ఓటు వేస్తే గెలిచిన తుమ్మల, అదే వర్గానికి చెందిన నేత గోపినాథ్ సతీమణిని డ్రామా అంటారా? అని ప్రశ్నించారు. మాగంటి సునీతకు మంత్రుల వ్యాఖ్యలు తీవ్ర మనస్తాపం కలిగించాయని, వారు వెంటనే క్షమాపణ

2 లో

### జూబ్లీహిల్స్ లో బిఆర్ఎస్‌కు
# గుణపాఠం తప్పదు

- మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరిక






(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 14 : జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో భారత రాష్ట్ర సమితి గూబ గుయ్యిమనేట్లు ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ ఉప ఎన్నికలో ఆ పార్టీ చిరునామా గల్లంతవుతుందని జోస్యం చెప్పారు. పదేళ్లలో ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్‌లో ఏం అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఓడగొట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చారు. కంటోన్మెంట్

2 లో

# హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చింది

- రిజర్వేషన్ల ఆశలపై నీళ్లు చల్లారు
- బంద్‌తో బిసిల ఆకాంక్షను వెల్లడిస్తాం
- బంద్ పోస్టర్ ఆవిష్కరణలో ఆర్. కృష్ణయ్య



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబరు 14 : బీసీల వాదన వినకుండా తెలంగాణ హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందని బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి కన్వీనర్ ఆర్. కృష్ణయ్య వ్యాఖ్యానించారు. తామంతా రిజర్వేషన్ల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో నోటికాడ బుక్క ఎత్తిపోయిందన్నారు. ఇది తమను ఎంతగానో ఆందోళనకు గురిచేసిందన్నారు. మంగళవారం బీసీ సంఘాల తెలంగాణ బంద్ పోస్టర్స్‌ని ఆర్. కృష్ణయ్య, కోదండరాం, జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్స్‌పై హైకోర్టు స్టే ఇవ్వడంతో న్యాయం జరుగలేదని పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇచ్చి బీసీల నోటికాడి ముద్దను లాక్కుందని విమర్శించారు. బీసీలకు అవమానం, అన్యాయం జరిగిందని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంఘాలు చెప్పిన అంశాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. బీసీ బంద్‌కి ఇప్పటికే సంపూర్ణ మద్దతు ప్రకటించామని కోదండరాం పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్స్‌ని అడ్డుకోవద్దని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ నెల 18వ తేదీన నిర్వహించే తెలంగాణ బంద్‌కి సంపూర్ణ మద్దతు తెలపాలని బీసీ జేఏసీ తెలంగాణ జన సమితి నేతలు తమ కార్యాలయానికి వచ్చి అడిగారని తెలిపారు. తమ కంటే ముందే బంద్‌కి కోదండరాం సంపూర్ణ మద్దతు తెలిపారని గుర్తుచేశారు. కోదండరాం మద్దతుతో బంద్ వందశాతం సక్సెస్ అయినట్లేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన నాయకుడు

2 లో

# రిజర్వేషన్లు బిసిల హక్కు

- ఎవరి దయాదాక్షిణ్యాలతో ఇచ్చేవి కావు
- కొన్ని పార్టీలవి రెండు నాల్కల ధోరణి
- తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 14 : రిజర్వేషన్లు బీసీల హక్కు అని, ఎవరి దయా దాక్షిణ్యాల మీద ఇచ్చేవి కాదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం అన్నారు. జనాభా దామాషా పద్ధతిలో వారికి రావాల్సిన హక్కు ఉందన్నారు. ఎంతోకాలంగా వారు రాజకీయంగా అవకాశాలు అందిపుచ్చుకోలేక పోతున్నారని అన్నారు. రిజర్వేషన్లు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపగలవని అన్నారు. మానత్వపు పునాదులపై కొత్త సమాజం ఏర్పాటు చేసేందుకే అవి ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సాధన కోసం ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వర్‌రావు నేతృత్వంలో ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇతర సంఘాలతో కలిసి ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. రిజర్వేషన్ల అంశంపై కొన్ని పార్టీలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయి. కేసులు వేసిన వ్యక్తులకు మద్దతు తెలుపుతూ..

2 లో

### బిఆర్ఎస్‌లోకి
# పలువురు చేరిక

- కండువా కప్పి ఆహ్వానించిన కెటిఆర్



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్,అక్టోబరు14 : జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్‌లోకి చేరికలు ఊపందుకున్నాయి. నియోజకవర్గంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అలీ మస్కతి, టీడీపీ సీనియర్ మహిళా నేత షకీలా రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాలనే లక్ష్యంతోనే పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. మస్కతి, షకీలారెడ్డి చేరికతో నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ చేరికల సందర్భంగా కేటీఆర్‌తో మాజీ మంత్రులు మల్లారెడ్డి, కొప్పుల ఈశ్వర్, పార్టీ నాయకులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, రాజీవ్ సాగర్, తుంగబాలు తదితరులు ఉన్నారు.

# గురుకులాకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు

- రేవంత్ మాటలు నమ్మశక్యంగా లేవు
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబరు14 : గురుకులాకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు విడుదల చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలేనా..? అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. కమీషన్‌లు రావనే ఆయన గురుకులాలకు నిధులు కేటాయించడం లేదా..? అని విమర్శించారు. హామీలతో మభ్యపెట్టడం, ఆ తర్వాత మాట మార్చడమే రేవంత్ అనుసరిస్తున్న సిద్ధాంతమా..? అని నిలదీశారు. ఈ మేరకు హరీశ్‌రావు ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. 'రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన ఉండదనడానికి గురుకులాలకు కేటాయించిన చాలీచాలని నిధులే ఉదాహరణ. రాష్ట్రంలోని 1024 గురుకులాలకు

2 లో

# మాగంటి సునీతపై అనుచిత వ్యాఖ్యలు

- మహిళలకు పొన్నం, తుమ్మల క్షమాపణలు చెప్పాలి
- ఎమ్మెల్సీ తాతా మధు డిమాండ్



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబరు 14 : 'మీరు చనిపోతే మీ భార్యలు ఏడవరా..?' అని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు మండిపడ్డారు. వాళ్లు చనిపోతే వాళ్ల భార్యలు ఏడుస్తారో

2 లో

# పూరన్ ఆత్మహత్యపై సత్వర దర్యాప్తు

## - ఉన్నతస్థాయిలో కూడా దళితులకు స్వేచ్ఛ కరవు

## - పూరన్ కుటుంబ సభ్యులకు రాహుల్ పరామర్శ







(ఆకాంక్ష న్యూస్)

చండీఘడ్, అక్టోబర్ 14 : హరియాణాలోని సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పూరన్ కుమార్ కుటుంబాన్ని కలిశారు. ఈ సందర్భంగా పూరన్‌కు నివాళులర్పించిన ఆయన.. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. అనంతరం రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వాధికారిపై ఇలాంటి వివక్ష చోటుచేసుకోవడం విషాదకరమన్నారు. ఈ కేసుకు సంబంధించి స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా విచారణ జరుపుతామని స్వయంగా హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ హామీ ఇచ్చారన్నారు. కానీ, రోజులు గడుస్తున్నా.. అది నెరవేరటం లేదని విమర్శించారు. తండ్రిని పోగొట్టుకున్న పూరన్‌కుమార్ ఇద్దరు పిల్లలు చాలా ఒత్తిడిలో ఉన్నారన్నారు. పూరన్ కుమార్ కెరీర్‌ను, ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇతర అధికారులు సంవత్సరాలుగా వివక్ష కొనసాగించారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇది కేవలం ఒక దళిత కుటుంబానికి సంబంధించినది కాదని, దేశంలోని కోట్లాది మంది దళితులకు సంబంధించినదని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారిపై జరిగిన వివక్ష దళితులుగా ఎంత విజయం సాధించినా.. అణచివేత తప్పదనే తప్పుడు సందేశం వారికి వెళ్లేలా చేస్తుందన్నారు. పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారకుల్కైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ, సీఎంలను డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంపై ఉన్న ఒత్తిడిని తొలగించాలన్నారు. ఇక, ఈ కేసుకు సంబంధించి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుపై పంపించిన సంగతి తెలిసిందే. బ్యూరోక్రసీ, పోలీస్ వ్యవస్థలో కుల వివక్ష ఉందనే ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఆయన ఆత్మహత్యపై తక్షణం స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరపాలని, ఇందుకు కారకుల్కైన వారిపై చర్యలు తీసుకోవాలని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ఐపీఎస్ అధికారి కుటుంబానికి సంబంధించినదని కాదని, కోట్లాది దళితుల ఆత్మ గౌరవానికి సంబంధించినదని అన్నారు. పూరన్ కుమార్ అక్టోబర్ 7న రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎనిమిది పేజీల సూసైడ్ నోట్‌లో హర్యానా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్తక్ ఎస్పీ నరేంద్ర బిజర్నియాతో సహా పలువురు పేర్లు ఆయన ప్రస్తావించారు. కుల వివక్ష, మానసిక వేధింపులు, పబ్లిక్‌లో అవమానించడం వంటి చర్యలకు వీరు పాల్పడ్డారని ఆరోపించారు.

# నీటిపారుదల శాఖలో కుదుపు

## - 106మంది ఇంజనీర్ల తక్షణ బదిలీ

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 14 : నీటిపారుదల శాఖలో అవినీతి అధికారుల వ్యవహారం కలకలం రేపుతున్న తరుణంలో ..హైదరాబాద్ సర్కిల్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 106 మంది ఇంజినీర్లను బదిలీ చేస్తూ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌వోసీల జారీ విషయంలో ఇంజినీర్లపై వచ్చిన ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. బదిలీ అయిన ఇంజినీర్లలో ఈఈలు, డీఈఈలు, ఏఈఈఈలు ఉన్నారు. గతంలో వచ్చిన ఆరోపణలతోపాటు, క్షేత్ర స్థాయిలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు రావడంతో సమూల ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం క్షేతస్థాయి ఇంజినీర్లను బదిలీ చేసింది. హైదరాబాద్ సర్కిల్ పరిధిలోనే 60 మందికిపైగా ఇంజినీర్లపై బదిలీ వేటు వేయడం గమనార్హం. వీరంతా ఒకేచోట తిష్టవేసి అక్రమలకు పాల్పడుతున్నారని ప్రభుత్వానికి నివేదికలు అందాయి. దీంతో వీరిని బదిలీలతో సమస్యకు చెక్ పెట్టాలని చూస్తోంది.

# హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చింది

మొదటి పేజీ తరువాయి

కోదండరాం అని ప్రశంసించారు. తెలంగాణలోని రెండున్నర కోట్ల బీసీల హక్కుల కోసం ఈ బంద్ చేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ సమాజం ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులగణన చేపట్టిందని గుర్తుచేశారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్స్ కోసం బిల్లు రూపకల్పన చేశారని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీసీల నోటికాడి ముద్దను కొంతమంది లాక్కుంటున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్స్ వ్యతిరేకులారా.. జనాభా దామాషా ప్రకారం తమ వాటా తమకు కావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సూచించారు. అఖిల పక్షాన్ని రాష్ట్రపతి, ప్రధానిని కల్పించాలని కోరారు. రాష్ట్రపతి, ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే.. వారి ఇళ్ల ముందు ధర్నా చేపట్టాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

# బనకచర్లపై ఏపిని నిరోధించండి

## - కేంద్రానికి మరోమారు తెలంగాణ లేఖ

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్,అక్టోబరు14 : పోలవరం- బనకచర్ల లింకు ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వాన్ని నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్లు లేఖలో గుర్తు చేశారు. డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే, నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింక్ ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులకు లేఖ రాసింది. తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. పోలవరం - బనకచర్ల విషయంలో ఏపీ ముందుకెళ్లకుండా నిలువరించాలని కోరారు. టెండర్, భూసేకరణ విషయంలో ముందుకెళ్లకుండా చూడాలని కోరారు.

# తాలిబన్ నేతను ఎలా స్వాగతిస్తారు

## - ఎక్స్ వేదికగా మండిపడ్డ జావేద్ అఖ్తర్

(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ,అక్టోబరు14 :అఫ్ఘానిస్తాన్ విదేశాంగ మంత్రి, సీనియర్ తాలిబాన్ నాయకుడు అమీర్ ఖాన్ ముత్తకీ భారత పర్యటన సందర్భంగా ఆయనకు లభించిన ఆదరణపై దిగ్గజ బాలీవుడ్ గేయరచయిత జావెద్ అఖ్తర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన.. ప్రపంచంలోనే అత్యంత దారుణమైన ఉగ్రవాద సంస్థగా పేరొందిన తాలిబాన్ ప్రతినిధికి ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తామని ఉపన్యాసాలు ఇచ్చే బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న గౌరవం, స్వాగతం చూస్తుంటే సిగ్గుతో తన తల వాలిపోతుందని జావేద్ తెలిపాడు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని దారుల్ ఉలూమ్ దియోబంద్ ఇస్లామిక్ సెమినరీలో ముత్తకీకి అందించిన గౌరవప్రదమైన స్వాగతంపై కూడా అఖ్తర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మాయిల విద్యను పూర్తిగా నిషేధించిన వ్యక్తులలో ఒకరైన తమ ఇస్లామిక్ హీరోకు ఇంతటి గౌరవం ఇచ్చిన దియోబంద్‌కు కూడా సిగ్గుండాలి అని ఆయన ఘాటుగా విమర్శించారు. చివరగా, 'నా భారతీయ సోదరీ సోదరులారా! మన దేశంలో ఏం జరుగుతోంది? అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

# గాడిద చర్మం నుంచి ఔషధాల తయారీ

## - పాక్ నుంచి 2వేల గాడిదలు కొన్న చైనా

(ఆకాంక్ష న్యూస్)

లాహోర్,అక్టోబరు14 :చైనా తాజాగా పాకిస్థాన్ నుంచి రెండు వేల గాడిదలను కొనుగోలు చేసింది. పాకిస్థాన్ నుంచి చైనా అత్యధికంగా గాడిదలను దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో 2024లో ఈ రెండు దేశాల మధ్య డీల్ కుదిరింది. ఈ డీల్ ప్రకారం చైనాకు పాకిస్థాన్ 20 వేల గాడిదలను ఎగుమతి చేయాలి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌లోని కరాచీ పోర్ట్‌కు సమీపంలో ఓ భారీ కబేళాను నిర్మించాలని చైనా భావిస్తోంది. పాకిస్థాన్‌లో ప్రస్తుతం 52 లక్షల గాడిదలు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక గాడిదలను కలిగిన మూడో దేశంగా పాకిస్థాన్ ఉంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ గాడిదలను దిగుమతి చేసుకునేందుకు చైనా గతేడాది ఒప్పందం కుదుర్చుకుంది. గాడిద చర్మంతో చైనాలో సాంప్రదాయ ఔషధాలను తయారు చేస్తారు. గాడిద చర్మాన్ని ఉపయోగించి ఎజియావో అనే సాంప్రదాయ ఔషధాన్ని చైనీయులు తయారు చేస్తారు. ఈ ఔషధం రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి, అలసట, కణితులను తగ్గించడానికి, రక్తహీనత చికిత్సకు సాయపడుతుందని చైనీయులు నమ్ముతారు. ఎజియావో ఔషధానికి చైనాలో భారీ డిమాండ్ ఉంది . అయితే ఈ ఔషధ తయారీకి తగినన్ని గాడిదలు చైనాలో లేవు. దీంతో గాడిదల కోసం పాకిస్థాన్‌పై ఆధారపడుతున్నారు. అయితే చైనా డీల్ కారణంగా పాక్‌లో గాడిదలకు విపరీతమైన డిమాండ్ పెరిగిందని సమాచారం. ఐదేళ్ల క్రితం ఒక్కో గాడిద ఖరీదు రూ.30 వేలుగా ఉండేదట. ప్రస్తుతం పాక్‌లో ఒక్కో గాడిద ఖరీదు రూ.2 లక్షలకు పైగా పలుకుతోందట. దీంతో గాడిదలను ఉపయోగించి పనులు చేసుకుని పాక్ వాసులు కష్టాలు పడుతున్నారట.

# విశాఖలో గూగుల్ సెంటర్

మొదటి పేజీ తరువాయి

దీనిద్వారా ప్రజలందరికీ కృత్రిమ మేధ అందుబాటులోకి రానుంది. మన డిజిటల్ ఎకానమీకి మరింత ఊపునిస్తుంది. గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత స్థానం మరింత సుస్థిరమవుతుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తంచేశారు. దీనికి ముందు పిచాయ్ స్పందిస్తూ.. విశాఖపట్నంలో గూగుల్ తొలి ఏఐ హబ్‌కు సంబంధించిన ప్రణాళికలను పంచు కునేందుకు ప్రధానితో మాట్లాడానని, ఈ ఏఐ హబ్ ఓ కీలక మైలురాయిగా నిలవనుందని అన్నారు. ఇదొక చిరస్మరణీయమైన రోజు. విశాఖలో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణం కోసం గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం, ఏఐ విప్లవంలో భాగం కావడం గర్వంగా ఉంది. ఈ పెట్టుబడులు హెల్త్‌కేర్, వ్యవసాయం, లాజిస్టిక్స్, ఫైనాన్స్ వంటి రంగాల్లో వేగవంతమైన ఏఐ ఆధారిత పరిష్కారాల కోసం తగిన వ్యవస్థను సృష్టిస్తుంది. సంక్లిష్ట సవాళ్లను పరిష్కరించడంలో తగిన తోడ్పాటు లభిస్తుందని గౌతమ్ అదానీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఢిల్లీ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య మంగళవారం ఈ ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు

మొదటి పేజీ తరువాయి

కేవలం రూ.60 కోట్లు కేటాయించి, గోరంతను కొండంతగా చెప్పుకోవడం సిగ్గుచేటు. రూ.12 వేల కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తామని ప్రచారం చేసుకుంటున్న రేవంత్ రెడ్డికి ఆరున్నర లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బిడ్డలు చదివే గురుకులాలకు కనీసం రూ.100 కోట్లు కేటాయించే మనసు లేదా..?' అని ప్రశ్నించారు. 'కమిషన్లు రావనే గురుకులాలకు నిధులు కేటాయించడం లేదా? మీరు కేటాయించిన చాలీచాలని నిధులతో సిబ్బంది వేతనాలు, మోటార్ల మరమ్మతులు, అత్యవసర పనులు ఎలా సాధ్యం? చిత్తశుద్ధిలేని సమీక్షలతో గురుకులాలకు ఏం ప్రయోజనం? ఒకవైపు సమస్యల వలయంలో గురుకులాలు కొట్టుమిట్టాడుతుంటే తూతూమంత్రంగా సమీక్ష నిర్వహించడం దుర్మార్గం. గురుకులాలకు నిత్యావసరాలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారు? పెండింగ్ లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు, స్టిచ్చింగ్ ఛార్జీలు ఎప్పుడిస్తారు? అ÷-దదె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు అ÷-దదె బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు? నెలలుగా పెండింగ్‌లో ఉన్న తాత్కాలిక సిబ్బంది వేతనాలు ఎప్పుడిస్తారు?' అని హరీశ్‌రావు నిలదీశారు. గురుకులాల మీద ప్రభుత్వానికి పట్టింపు ఉంటే విద్యార్థులు ఎందుకు నిరసనలు తెలియజేస్తున్నారు? బడిబాట పట్టాల్సిన విద్యార్థులను, ఆందోళన బాట పట్టించింది కాంగ్రెస్ ప్రభుత్వం. రేవంత్ రెడ్డీ మీ 22 నెలల పాలనలో గురుకులాల ఖ్యాతిని దిగజార్చారు. విష వలయాలుగా మార్చారు. అపఖ్యాతిని మూటగట్టుకున్నారు' అని మండిపడ్డారు. 22 నెలలుగా గురుకులాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికై అవసరమైన నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# జూబ్లీహిల్స్ లో బిఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

మొదటి పేజీ తరువాయి

ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పారు. జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్ల నమోదుకు భారత రాష్ట్ర సమితి, భాజపాలదే బాధ్యతని అన్నారు. మాగంటి సునీతతో కన్నీరు పెట్టిస్తూ.. గులాబీ పార్టీ ఓట్లు దండుకోవాలని చూస్తోందని పొన్నం విమర్శించారు. ఈ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ గట్టి బుద్ధి చెప్పబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి పరంగా ఏ మాత్రం ముందుకు సాగలేదని, ఇప్పుడు ప్రజలే ఆ విఫలతకు తీర్పు ఇవ్వబోతున్నారని అన్నారు. పదేళ్ల పాలనలో అభివృద్ధి పేరుతో ఒక్క రోడ్డు సరిచేయలేని బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు ఓట్ల కోసం నటన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే ఆ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్, బీజేపీ రెండు పార్టీలకూ ప్రజలు సరైన పాఠం చెప్పబోతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈసారి ఓటర్లు మోసపోవడం లేదని తీవ్ర విమర్శలు గుప్పించారు.

# మాగంటి సునీతపై అనుచిత వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

లేదో మంత్రులే చెప్పాలన్నారు. తెలంగాణ మహిళలకు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో మంత్రులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు వెన్నులో వణుకుపుడుతోందని అన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ మహిళా లోకాన్ని అవమానించే విధంగా, చిల్లరగా మాట్లాడారని తాతా మధు విమర్శిం చారు. ఇలాంటి నికృష్టమైన మంత్రులు తెలంగాణలో ఉండటం దురదృష్టకరమన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ చనిపోతే అందరూ సానుభూతి చూపారని, కానీ ఇలా నీచంగా మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్.. మేయర్ విజయలక్ష్మిని, విజయారెడ్డిని పక్కన పెట్టుకుని మాగంటి సునీతపై కామెంట్స్ చేశారని మధు మండిపడ్డారు. పాలేరు ఉప ఎన్నికల్లో తుమ్మల నాగేశ్వరరావు.. రాంరెడ్డి వెంకట్ రెడ్డి సతీమణి సుచరితపై గెలిచారని గుర్తుచేశారు. ఆడబిడ్డలు, భర్తలు చనిపోయిన వారిని అవమానించే విధంగా మంత్రులు మాట్లాడారని ఆరోపించారు.

# రిజర్వేషన్లు బిసిల హక్కు

మొదటి పేజీ తరువాయి

బీసీలకు అన్యాయం జరిగిందని ప్రచారం చేస్తున్నాయి. తెజసకి రెండు నాలుకల ధోరణి లేదు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు తెలుపుతుంది. కేంద్రంపైన ఒత్తిడి తీసుకొచ్చి బీసీ బిల్లును ఆమోదించేందుకే మా పోరాటం అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ర్యాలీలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహిస్తామని తెజస ఉపాధ్యక్షుడు పీఎల్. విశ్వేశ్వర్‌రావు అన్నారు. సుప్రీం కోర్టులో న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. 16న గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్లపై తెజస పలు తీర్మానాలు చేసింది. బీసీ సంఘాలు 18న నిర్వహించే బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించింది. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడంలో న్యాయం లేదని ఎంపీ, బీసీ రిజర్వేషన్ల సాధన సమితి కన్వీనర్ ఆర్. కృష్ణయ్య తెలిపారు. స్టే ఇవ్వడం ద్వారా బీసీల నోటికాడ ముద్దను లాక్కుందని వ్యాఖ్యానించారు. బీసీల వాదన వినకుండా కోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందన్నారు.

# తుమ్మల, పొన్నంలకు మానవత్వం ఉందా

మొదటి పేజీ తరువాయి

చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రుల మాటలను తెలంగాణ ఆడబిడ్డలు గమనించాలి అని ఆయన వ్యాఖ్యానించారు. యువకుడు..అలాగే, ప్రెస్ మీట్ సమయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి మంత్రుల పక్కనే కూర్చున్నా, ఆడబిడ్డ అవమానింపబడుతుండగా మౌనంగా ఉన్నారని గౌడ్ విమర్శించారు. రాజీవ్ గాంధీ చనిపోయినప్పుడు పార్టీలకతీతంగా అందరం బాధ పడ్డామని, ఇప్పుడు మాగంటి సునీత తన భర్తను గుర్తుచేసుకొని ఏడుస్తుంటే దాన్ని డ్రామా అంటారా? ఇది సిగ్గుచేటు అని మండిపడ్డారు. మాగంటి సునీత భావాలను దెబ్బతీసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లు వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

# సుప్రీంలో అనుకూల తీర్పు రావచ్చు

మొదటి పేజీ తరువాయి

రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్‌పీ) దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఈ నెల 9వ తేదీన హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ఈ ఎస్‌ఎల్‌పీ పిటిషన్ వేసింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధిస్తున్నట్లు రాజ్యాంగంలో ఎక్కడా నిబంధనలు లేవని ఎస్‌ఎల్‌పీలో తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సుప్రీంకోర్టు మాత్రమే దాన్నో మార్గదర్శక సూత్రంగా నిర్దేశించిందనీ పిటిషన్ లో పేర్కొంది. ప్రత్యేక సందర్భాల్లో రిజర్వేషన్లు కల్పించవచ్చని ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంతమేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం తెలంగాణలో జరిగిందని.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే 2024-25లో రాష్ట్ర జనాభాలో 56.33శాతం మంది బీసీలు ఉన్నారని తెలిపింది. రాహుల్ రమేశ్ వాఘ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. తమిళనాడు గవర్నర్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తావించింది. ప్రభుత్వం శాసనసభలో ఆమోదించి పంపిన బిల్లులకు మూడు నెలల్లోపు గవర్నర్ ,రాష్ట్రపతి ఆమోదం తెలుపకపోతే వాటికి ఆమోదముద్ర వేసినట్లుగానే భావించాల్సి ఉంటుందని.. ఈ విషయాలను పరిగణలోకి తీసుకోవాలంటూ పిటిషన్ లో పేర్కొంది. న్యాయం తమవైపు ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. సుప్రీంలో తప్పకుండా అనుకూల తీర్పు వస్తుందని అన్నారు.

# గురుకుల కాలేజీ విద్యార్థినిని ఆత్మహత్య

మొదటి పేజీ తరువాయి

రివేసుకుంది. ఇది గమనించిన తోటి విద్యార్థులు కాలేజీ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వెంటనే వారు ఆస్పత్రికి తరలించారు. కానీ పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున ప్రియాంక మృతిచెందింది. హాస్టల్‌లో ఉండటం తనకు ఇష్టం లేదని మూడు రోజుల క్రితం ప్రియాంక తన తల్లిదండ్రులకు ఫోన్ చేసింది.. అయితే అక్కడకే ఉండి చదువుకోవాలని ఆమె తండ్రి చెప్పాడని పోలీసులకు తోటి విద్యార్థులు తెలిపారు.

# కుటుంబ కలహాల నేపథ్యం

మొదటి పేజీ తరువాయి

సాయిలక్ష్మికి ఇద్దరు కవల పిల్లలు చేతన్ కార్తికేయ, లాస్యతవల్లి ఉన్నారు. తాజాగా అందిన సమాచారం మేరకు గత కొంతకాలంగా భర్తతో వచ్చిన కుటుంబ విభేదాలు, వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి గురైన సాయిలక్ష్మి, ఆవేశంతో తన ఇద్దరు పిల్లలను చంపి అనంతరం బిల్డింగ్ పై నుంచి దూకి ప్రాణాలు తీసుకుంది. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# నిజాయితీకి నిదర్శనంగా ఆటో డ్రైవర్ సయ్యద్ నజీర్

## - దొరికిన పర్సును పోలీసులకు అప్పగింత


గోదావరిఖని,అక్టోబర్ 14 (ఆకాంక్ష): మానవతా విలువలు క్షీణిస్తున్న ఈ రోజుల్లో కూడా నిజాయితీకి ప్రతీకగా నిలిచాడు ఒక ఆటో డ్రైవర్. గోదావరిఖని పట్టణంలోని ఎన్టీపీసీ టిటిఎస్ గేటు సమీపంలో రోడ్డుపై దొరికిన పర్సును ఎలాంటి స్వార్థం లేకుండా పోలీసులకు అప్పగించి, తన నిష్కళంకతను చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం గోదావరిఖని టిటిఎస్ గేటు వద్ద ప్రయాణికులను తీసుకెళ్లిన ఆటో డ్రైవర్ సయ్యద్ నజీర్ రోడ్డు పక్కన పడి ఉన్న ఒక పర్సును గుర్తించాడు. పర్సును తీసుకొని లోపల చూసి, అందులో రూ.3,000 నగదు, ఒక సెల్‌ఫోన్, ఓటర్ ఐడీ కార్డు ఉన్నట్లు తెలిసింది. దానిని ఎవరి సొత్తు అని తెలుసుకోకుండా స్వాధీనం చేసుకోకుండా, నేరుగా ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్కు వెళ్లి పర్సును అప్పగించాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది నజీర్ యొక్క నిజాయితీని అభినందిస్తూ, ఆయనను ప్రత్యేకంగా సత్కరించారు. ఆ పర్సులో ఉన్న వస్తువుల యజమాని ఎవరైనాఉంటే,వారుఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సాధారణంగా చిన్న ప్రయోజనం కోసం నమ్మకాన్ని తాకట్టు పెట్టే ఈ కాలంలో, సయ్యద్ నజీర్ చేసిన ఈ ఉదాత్త చర్య సమాజానికి ఆదర్శంగా నిలిచింది. స్థానికులు కూడా ఆయనను ప్రశంసిస్తూ ఇలాంటి నిజాయితీ గల వ్యక్తులు సమాజంలో ఇంకా ఉన్నారంటే అది గర్వకారణం అని అభిప్రాయ పడ్డారు.

# ఎంఆర్ఓ కార్యాలయం ముందు ఓ యువ రైతు ఆత్మహత్యాయత్నం



కుత్బుల్లాపూర్ అక్టోబర్ 14 (ఆకాంక్ష) : మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం దుండిగల్ గండిమైసమ్మ ఎంఆర్ఓ కార్యాలయం ముందు ఓ యువ రైతు ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గగిల్లాపూర్ తండాకు చెందిన సిద్ధూ(27) అనే యువకుడు తన భూమిని ఓ బడానిర్మాణ సంస్థకు కట్టబెట్టేందుకు రెవెన్యూ అధికారుల యత్నిస్తున్నారని ఆరోపణలు చేశాడు. తన భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని ఎంఆర్ఓ ఆఫీస్ చుట్టూ తిరిగాడు. రెవెన్యూ అధికారులు 6లక్షలు రూపాయలు డిమాండ్ చేయడంతో యువకుడి మనస్తాపం చెందాడు. తన భూమి పత్రాలు పట్టుకుని ఎంఆర్ఓ కార్యాలయం ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించాడు.

# ఇద్దరు కవల పిల్లలను చంపి, ఓ తల్లి ఆత్మహత్య



బాలానగర్ అక్టోబర్ 14 (ఆకాంక్ష ) : హైదరాబాద్‌లోని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఇద్దరు కవల పిల్లలను చంపి, ఓ తల్లి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఏపీలోని ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన సాయిలక్ష్మీ (27)కి అనిల్ కుమార్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి తర్వాత పద్మారావు నగర్ ఫేజ్ 1లో నివాసం ఉంటున్నారు. ఈ దంపతులకు రెండేళ్ల వయసు ఉన్న కవల పిల్లలు చేతన్ కార్తికేయ, లాస్యత వల్లి ఉన్నారు. అయితే వీరు తరచూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. చేతన్‌కు మాటలు రాకపోవడంతో కొంతకాలంగా స్పీచ్‌థెరపీ ఇప్పిస్తున్నారు. పిల్లల విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే తాజాగా మరోసారి గొడవ జరగడంతో మనస్తాపం చెందిన సాయిలక్ష్మీ బలవన్మరణానికి పాల్ప డింది. తాను ఆత్మహత్య చేసుకోవడానికి ముందు ఇద్దరు పిల్లలను గొంతు నులిమి చంపేసింది. అనంతరం మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో అనిల్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# బీసీలను మోసం చేస్తే కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు

## - కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్



ఓదెల,అక్టోబర్ 14(ఆకాంక్ష) : బీసీలను మోసం చేస్తే కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదని కేటీఆర్ సేన పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా ఓదెలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అంటేనే మోసానికి ప్రతిరూపమని, బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం తూట్లు పొడుస్తూ మోసం చేస్తోందని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిజమైన చిత్తశుద్ధితో ఉంటే 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిందని ఆయన డిమాండ్ చేశారు. కానీ బీసీల పట్ల కపట ప్రేమను ప్రదర్శిస్తూ, జీవో 9 జారీ చేసి ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా బీసీ కులాలను మోసం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే స్థాయికి బీసీ సమాజం ఎదురు తిప్పుకుంటుందని హెచ్చరించిన శ్రీకాంత్ గౌడ్, బీసీ బిడ్డల నోటికాడి బుక్కను గుంజుకోవద్దని స్పష్టంగా పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో 6 గ్యారెంటీలతో ఒకసారి మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసం బీసీ రిజర్వేషన్ల పేరుతో మరోసారి మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. బీసీలకు న్యాయం చేయకుండా, ప్రజలతో నయవంచన చేస్తూ పాలన కొనసాగిస్తే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజల వద్ద నుండి ఎటువంటి అంగీకారం లభించదని హెచ్చరించిన శ్రీకాంత్ గౌడ్, "ఇలాగే మోసపూరిత రాజకీయాలు కొనసాగితే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో నూకలు చెల్లుతాయి" అంటూ తేటతెల్లంగా చెప్పారు. ఈ సమావేశంలో కేటీఆర్ సేన మండల నాయకులు, యువకార్యకర్తలు, స్థానిక నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ రైల్వే స్టేషన్లలో ఆటోలకు ఉచిత పార్కింగ్ ఇవ్వాలి


## - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు ఆటో జేఏసీ రాష్ట్ర కమిటీ వినతిపత్రం



హైదరాబాద్,అక్టోబర్ 14 (ఆకాంక్ష) : రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో జేఏసీ రాష్ట్ర కమిటీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావుకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రైల్వే స్టేషన్లలో ఆటో డ్రైవర్లకు ఉచిత పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరారు. అలాగే 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు. ఆ హామీలలో భాగంగా ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం, సంవత్సరానికి కాకుండా నెలనెలా రూ. 12,000 చెల్లించడం, ఆత్మహత్యకు పాల్పడిన ఆటో డ్రైవర్ కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయడం, ప్రస్తుతం ఉన్న రూ. 8,000 ఇన్సూరెన్స్ ప్రీమియాన్ని రూ. 1,000కు తగ్గించడం, అలాగే ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ. 5 లక్షల బీమా సదుపాయం కల్పించాలని వారు కోరారు. ఈ ప్రతిపాదనలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు సానుకూలంగా స్పందించి, ఆటో డ్రైవర్ల సమస్యలను పార్టీ స్థాయిలో ప్రస్తావించి, రైల్వే స్టేషన్లలో పార్కింగ్ స్థలాల కేటాయింపు మరియు సంక్షేమ బోర్డు ఏర్పాటు దిశగా తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై ఈ వినతిపత్రం సమర్పణ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆటో జేఏసీ నేతలు త్వరలోనే పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్ల సమావేశాలను నిర్వహించి ప్రభుత్వం, సంబంధిత శాఖల దృష్టికి తమ డిమాండ్లను తీసుకువెళ్లే దిశగా కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్, చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, రాష్ట్ర నాయకులు నీలారపు రవి, జిల్లా కోశాధికారి లంకెల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందం, తాండూర్ మండల అధ్యక్షుడు మొహమ్మద్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన నిర్ణయం

## - కేసీఆర్ ఫొటో లేకుండానే రాష్ట్ర వ్యాప్తంగా యాత్రకు సిద్ధం
## - ప్రొఫెసర్ జయశంకర్ ఫొటోతోనే ప్రచారం
## - జాగృతి శ్రేణులకు ఆదేశాలు



ప్రత్యేక ప్రతినిధి,అక్టోబర్ 14 (ఆకాంక్ష): తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలనానికి తెరలేపుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ యాత్ర చేపట్టేందుకు కవిత సన్నాహాలు ప్రారంభించారు. ఈ యాత్రను అక్టోబర్ చివరి వారంలో ప్రారంభించేందుకు ఇప్పటికే జాగృతి సమితులు సన్నద్ధమవుతున్నాయి. ఇదే సందర్భంలో కవిత తీసుకున్న నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈసారి తన యాత్ర ప్రచారంలో మాజీ ముఖ్యమంత్రి, తండ్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ఫొటోను పూర్తిగా ఉపయోగించకూడదని కవిత నిర్ణయించినట్టు సమాచారం. బదులుగా తెలంగాణ ఆత్మ, ఉద్యమ ప్రేరణాత్మక నేత ప్రొఫెసర్ జయశంకర్ ఫొటోతోనే పోస్టర్లు, బ్యానర్లు, వాహనాల అలంకరణలు ఉండాలని ఆమె జాగృతి నాయకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ఉద్యమ పునాదులపై పయనమయ్యే ఈ యాత్రలో ప్రజలతో ప్రత్యక్షంగా కలవడం, ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ నింపడం కవిత లక్ష్యంగా పెట్టుకున్నారని ఆమె సమీప వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయం ద్వారా కవిత తెలంగాణ అసలైన భావజాలాన్ని మరోసారి ప్రదర్శించబోతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేసీఆర్ ఫోటో లేకుండా జాగృతి కార్యకలాపాలు సాగడం ఇదే మొదటి సారి కావడంతో పార్టీ వర్గాల్లో కూడా ఆసక్తికర చర్చ మొదలైంది. రాజకీయంగా స్వతంత్ర ప్రస్థానానికి ఇది సంకేతమా? లేక ప్రజల్లో కొత్త రాజకీయ స్ఫూర్తి రగిలించాలన్న ప్రయత్నమా? అనే అంశంపై రానున్న రోజుల్లో స్పష్టత రానుంది. ఇక యాత్ర రూట్‌మ్యాప్, తేదీల వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. తెలంగాణ స్ఫూర్తితో, ప్రజా సమస్యలతో సాగబోయే ఈ యాత్ర రాష్ట్ర రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకుల అంచనా వేస్తున్నారు.



# గురుకుల పాఠశాలల్లో 5వ నుండి 9వ తరగతుల ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్,అక్టోబర్ 14(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు టీజీఎస్‌డబ్ల్యూడబ్ల్యూఆర్‌ఈఐఎస్ జిల్లా కోఆర్డినేటర్ దేవసేన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాల్లో బాలురు, బాలికల గురుకుల పాఠశాలల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. బాలికల పాఠశాలలు మల్లాపూర్, నంది మేడారం, గర్రెపల్లి, రామగుండం మండలాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. బాలుర పాఠశాలలు మంథని మరియు పెద్దపల్లిఏసుల్తానాబాద్ కేంద్రాల్లో ఉన్నాయని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు 2025 అక్టోబర్ 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. దరఖాస్తులను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మల్లాపూర్ వద్ద సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ప్రవేశ పరీక్ష రాసి ఉంటే హాల్‌టికెట్, ర్యాంక్ ధ్రువీకరణ పత్రం జతచేయాలని, పరీక్షకు దరఖాస్తు చేసుకుని హాజరు కాలేదని యెడల హాల్‌టికెట్ ప్రతిని సమర్పించవలసిందిగా సూచించారు. అదనంగా కుల ధ్రువీకరణ పత్రం (క్యాస్ట్ సర్టిఫికేట్) జిరాక్స్ కాపీని జతపరచాలని కోరారు. దరఖాస్తులు నిర్దేశిత గడువు లోపు సమర్పించినవారికి మాత్రమే ప్రవేశావకాశం కల్పించబడుతుందని స్పష్టం చేశారు. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ దేవసేన తెలిపారు.

# థింక్-పేర్- షేర్ విధానంపై ఉపాధ్యాయులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

## -ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్





పెద్దపల్లి, అక్టోబర్-14(ఆకాంక్ష) : థింక్-పేర్-షేర్ విధానంపై ఉపాధ్యాయులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయులకు థింక్-పేర్-షేర్ విధానం పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలో మౌనంగా ఉండేవాళ్ళు, ఇన్ యాక్టివ్ గా ఉండే విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేస్తూ మంచి బోధన అందించేందుకు థింక్ పేర్ షేర్ విధానం అమలకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. థింక్-పేర్- షేర్ విధానం ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయడానికి ముందు ఉపాధ్యాయులు దీనిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, వారికి ఉన్న ప్రతి అనుమానాలను శిక్షణ కార్యక్రమంలో నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. థింక్-పేర్- షేర్ విధానం వల్ల మౌనంగా ఇన్ ఆక్టివ్ గా ఉండే విద్యార్థులు ఎక్కువ మాట్లాడే వాళ్ళు అందరికీ సమానంగా మాట్లాడే అవకాశం కలిగిస్తుందని అన్నారు. బోధనలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలు క్రమంగా మెరుగవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్ వేదికగా చంద్రబాబు ఆసక్తికర పోస్ట్

## - గూగుల్ కమ్స్ టు ఏపి అంటూ హ్యాష్ ట్యాగ్

న్యూఢిల్లీ, అక్టోబరు14 :ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్ వేదికగా చేసిన ఓ ఆసక్తికర పోస్ట్ అందరినీ ఆకర్శిస్తోంది. ఓకే గూగుల్..సింక్రనైజ్ ఫర్ వికసిత్ భారత్ అంటూ సీఎం ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఇక్కడ 'ఓకె గూగుల్' అనేది గూగుల్ అసిస్టెంట్ ను ప్రారంభించే వాయిస్ యాక్టివేటెడ్ ట్రిగ్గర్. దీన్ని వాడి సీఎం చంద్రబాబు నాయుడు పెట్టిన పోస్ట్ అందరిని ఆకట్టుకుంటోంది. అలానే 'గూగుల్ కమ్స్ టు ఏపీ'హ్యాష్ ట్యాగ్‌తో చేసిన పోస్టులో ఆయన పలువురు ప్రముఖులకు ట్యాగ్ చేశారు. విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఏపీ సర్కార్ గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదుర్చుకుంది.





# రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల మార్గదర్శనం

## - పెద్దపల్లి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్...

పెద్దపల్లి,అక్టోబర్ 14(ఆకాంక్ష) : పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమం మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా జరిగింది. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీ భక్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గౌరవ వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అలాగే ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీ అల్తాఫ్ జానయ్య సమీక్షించి, రైతులకు పలు సూచనలు చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, పామ్ ఆయిల్ పంటల సాగును విస్తరించాలన్నారు. ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంపుతో పాటు, రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అలవరచుకోవాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ప్రతి పంటకు సంబంధించిన వివరాలను కపాస్ యాప్ ద్వారా నమోదు చేయాలని, ఏవైనా సందేహాలు ఉంటే తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని మంత్రి సూచించారు.అలాగే, వరి మరియు మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రైతుల సౌకర్యాలపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు.పశువులలో వ్యాపిస్తున్న గాలికుంటు వ్యాధిపై కూడా జాగ్రత్తలు తీసుకోవాలని,అవసరమైన వ్యాక్సినేషన్ కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డివిజన్ వ్యవసాయ అభివృద్ధి అధికారి శ్రీనాథ్, మండల వ్యవసాయ అధికారి శ్రీమతి అలివేణి, క్లస్టర్ ఇంచార్జ్‌లు శ్రీమతి కల్పన, శ్రీ వినయ్, శ్రీ ప్రశాంత్, శ్రీ పూర్ణచందర్, కుమారి సువర్చల, శ్రీమతి రచన తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర పెరిక సంఘం నూతన అధ్యక్షుడిగా గటిక విజయ్ కుమార్

## - నూతన భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా సుందరి వీరభాస్కర్

గోదావరిఖని,అక్టోబర్ 14 (ఆకాంక్ష):రిపోర్టర్ (మడ్డి కుమార్) : తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా గటిక విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. అలాగే కోకాపేట భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా సుందరి వీరభాస్కర్ ఎన్నికయ్యారు. రాష్ట్ర పెరిక సంఘ గౌరవాధ్యక్షులు మద్దాలింగయ్య, ప్రధాన అధ్యక్షులు లగిశెట్టి చంద్రమౌళి, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా, పట్టణ స్థాయి నాయకులు ఈ సందర్భంగా కొత్త బాధ్యతలు స్వీకరించిన నాయకులను అభినందించారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు లగిశెట్టి చంద్రమౌళి మాట్లాడుతూ.. పెరిక సంఘ అభివృద్ధి దిశగా గటిక విజయ్ కుమార్ నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కోకాపేటలో నిర్మాణంలో ఉన్న పెరిక భవనం వేగంగా పూర్తవుతుందనే నమ్మకాన్ని తెలిపారు. 8వ కాలనీ పట్టణ అధ్యక్షులు మండసాయి, సెక్రటరీ గుండె ప్రశాంత్, కోశాధికారి సందీప్, గౌరవాధ్యక్షులు కందులు నరహరి, సలహాదారులు కర్రె రాజయ్య, గొర్ల చిన్నమల్లు, ముద్దసాని అభిలాష్ విజయ్‌కుమార్, వేణు తదితరులు ఎన్నికల ఫలితాల అనంతరం స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పెరిక కుల సంఘ ఐక్యతకు కృషి చేస్తానని, సభ్యుల సంక్షేమం, విద్యా మరియు ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం వద్ద నిరంతరం ప్రయత్నిస్తానని అన్నారు. కోకాపేట భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సుందరి వీరభాస్కర్ మాట్లాడుతూ...పెరిక భవనం త్వరితగతిన పూర్తి చేయడం కోసం అవసరమైన వనరులు సమీకరించి, ప్రతి సభ్యుడి భాగస్వామ్యంతో ఆ కలను సాకారం చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో పలు జిల్లా,మండల స్థాయి ప్రతినిధులు, సంఘం కార్యకర్తలు పాల్గొని కొత్త పదవులు చేపట్టిన నాయకులను ఘనంగా సత్కరించారు.

# రజకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ముందుకు రావాలి

## - దోబీ ఘాట్లు లేక ప్రమాదకర పరిస్థితుల్లో కులవృత్తి కొనసాగిస్తున్న రజకులు



మంచిర్యాల, అక్టోబర్ 14 (ఆకాంక్ష):మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ మండలం అరుణ్ అక్కనగర్ ఆర్కే%-%8 పరిధిలో నివసిస్తున్న రజకుల జీవన పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో దాదాపు 40 కుటుంబాలు తమ సంప్రదాయ కులవృత్తి అయిన బట్టలు ఉతకడం, ఇస్త్రీ చేయడం వంటి పనులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాయి. కానీ తగిన వసతులు లేకుండా ప్రమాదకర పరిస్థితుల్లో రోజువారీ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు మాట్లాడుతూ.. గత ముప్పై సంవత్సరాలుగా రజక వృత్తిని ఆధారంగా పెట్టుకుని జీవిస్తున్నా నేటికీ మా పరిస్థితులు మారలేదు. ప్రభుత్వాలు మారుతున్నా, రజకుల జీవితం మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మునుగోడు ఉప ఎన్నికల సమయంలో రజకుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.94 ప్రకారం రాష్ట్రంలోని 141 మున్సిపాలిటీలకు రూ.282 కోట్ల నిధులను కేటాయించి, ప్రతి మున్సిపాలిటీకి రూ.2 కోట్ల చొప్పున రజక భవనాలు, వాషింగ్ మిషన్లు ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ, అమలు కాలేదని ఆయన గుర్తుచేశారు. మున్సిపల్ కమిషనర్‌కు మేము వినతి పత్రం అందజేశాం అని ఇటీవల బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని కూడా కలిసి రజక వృత్తిదారుల సమస్యలను వివరించాం అని చెప్పారు. రజకులకు మోపెడ్ వాహనాలు అందజేయడం, ప్రభుత్వ హాస్టళ్లు, ఆసుపత్రులు, పోలీస్ బెటాలియన్లలో దోబీ పోస్టులు రజకులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే, ప్రభుత్వ భూముల్లో శాశ్వత దోబీ ఘాట్లు ఏర్పాటు చేసి, రజక వృత్తిని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని కోరారు. ఈ వృత్తిదారుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముస్కే చందర్, రజక వృత్తిదారులు అన్నారపు తిరుపతి, జంగా పెల్లి పాపయ్య, బండి లక్ష్మయ్య, పైతర గట్టయ్య, రాచర్ల ఓదెలు తదితరులు పాల్గొన్నారు.రజక వృత్తిదారుల సమస్యలు పదేళ్లుగా పరిష్కార దిశగా సాగకపోవడం పట్ల మండలంలోని ప్రజలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రజక వృత్తి అభివృద్ధికి సరైన మౌలిక వసతులు, ప్రభుత్వ సహకారం లభిస్తేనే ఈ వృత్తి నిలదొక్కుకుంటుందని వారు అభిప్రాయపడ్డారు.

# రైతులు పంట పొలాలు నష్టపోతే దానికి అధికారులే బాధ్యత



సారంగాపూర్ అక్టోబర్ 14(ఆకాంక్ష) : రైతులు పంట పొలాలు నష్టపోతే దానికి అధికారులే బాధ్యతలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం బీర్పూర్ మండలం చిన్న కొల్వాయి గ్రామంలోని లిఫ్ట్ ఇరిగేషన్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పంపుల్లో ఇరుక్కుపోయిన ఇసుకను తొలగిస్తే పంపులు ఆపరేట్ అవుతాయని వెంటనే మెకానిక్‌ను పిలిపించి సమస్యను పరిష్కరించాలని, లేదంటే సమస్య తలెత్తుతుందన్నారు. మాజీ మంత్రి సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను వివరించారు. వెంటనే సమస్యను పరిష్కరించి రైతులకు నీటిని సరాఫరా చేయాలని సూచించారు. రోళ్లవాగు ప్రాజెక్ట్‌కు 0.25 టీఎంసీ లోపు గేట్లు త్వరగా అమర్చాలని అన్నారు. షటర్లు ఆర్డర్ పెట్టమని వచ్చాక అమర్చుతామని అధికారులు వివరించారు. కొల్వాయి గ్రామంలోని శెనగకుంటకు పైపు కనెక్షన్ కలపాలని అధికారులకు సూచించారు.అనంతరం గోదావరి నీటి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. రైతాంగానికి ప్రకృతి కూడ సహకరిస్తుందని, పంటలకు సాగు నీరు అందుతుందని, కాలం సహకరించడంతో పంటలు బాగా పండుతాయన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మసరి రమేష్, మాజీ వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్ రావు, సింగిల్ విండో చైర్మన్ పాలుసాని నవీన్ రావు, పార్టీ మండల అధ్యక్షులు చెరుపూరి సుభాష్, మాజీ జడ్పీటీసీ ముక్క శంకర్, శేఖర్, నర్సయ్య, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

# మధుకర్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నిజాయితీ గల కార్యకర్త

## - మధుకర్ కుటుంబాన్ని పరామర్శించిన రాంచందర్ రావు
## - కాంగ్రెస్ దౌర్జన్యమే కారణమని వ్యాఖ్య
## - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు





మంచిర్యాల, అక్టోబర్ 14(ఆకాంక్ష):మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు ఏటా మధుకర్ ఆత్మహత్య ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ విషాద సంఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మంగళవారం ఆయన నీల్వాయి గ్రామానికి చేరుకుని మృతుడు మధుకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మధుకర్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నిజాయితీ గల కార్యకర్త అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యం, అక్రమ కేసులు, కాంగ్రెస్ నాయకుల వేధింపులు తట్టుకోలేక మధుకర్ ప్రాణాలు తీసుకోవడం తీవ్ర విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాంచందర్ రావు మాట్లాడుతూ...బీజేపీ కార్యకర్తలపై అణచివేత చర్యలు, భయపెట్టే ప్రయత్నాలు పెరుగుతున్నాయని విమర్శించారు. ఆ రాజకీయ దౌర్జన్యాలే మధుకర్ మరణానికి కారణం అని ఈ ఘటనను పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు.మధుకర్ మృతికి బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలంటూ రామగుండం సీపీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎంతటి అధికారంలో ఉన్నా, నేరస్తులు తప్పించుకోలేరు. బీజేపీ కార్యకర్తలందరికీ పార్టీ అండగా ఉంటుంది. ఎవరూ భయపడకూడదు, ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకూడదని పిలుపునిచ్చారు.రాంచందర్ రావుతో పాటు బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి సుభాష్, రాష్ట్ర నాయకుడు భరత్ తదితరులు కూడా ఈ సందర్భంగా పాల్గొన్నారు. నీల్వాయి గ్రామంలో బీజేపీ శ్రేణులు మధుకర్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సర్వేయర్ వేణు



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 14(ఆకాంక్ష) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ సర్వేయర్ ఏసీబీ వలలో చిక్కిన ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపింది. వివరాల్లోకి వెళ్తే... సిరిసిల్ల పట్టణానికి చెందిన సర్వేయర్ వేణు, చిన్న బోనాలలో ఉన్న భూమి సర్వేకు సంబంధించి ఓ వ్యక్తి నుండి లంచం డిమాండ్ చేసినట్టు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఇరుకుల ప్రవీణ్ అనే వ్యక్తికి చెందిన మూడు ఎకరాల భూమిని సర్వే చేయడానికి వేణు మొత్తం రూ.30,000 లంచం అడిగినట్టు సమాచారం.దీనితో బాధితుడు ఇరుకుల ప్రవీణ్ కరీంనగర్‌లోని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను ఆశ్రయించాడు. ప్రణాళిక ప్రకారం మొదట వేణుకు రూ.10,000 ఇచ్చిన ప్రవీణ్, తర్వాత పంచనామా సర్టిఫికేట్ కోసం మరో రూ.20,000 ఇవ్వడానికి అంగీకరించాడు. ఈ మొత్తం అందజేసే సమయంలోనే ఏసీబీ అధికారులు సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయంలో వల వేసి, సర్వేయర్ వేణును నేరుగా లంచం స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఆ తరువాత ఏసీబీ అధికారులు సర్వేయర్ నివాసంలోనూ శోధనలు నిర్వహించినట్లు తెలుస్తోంది. పట్టుబడ్డ వేణును అదుపులోకి తీసుకుని, సాక్ష్యాధారాలతో పాటు రిమాండ్‌కి తరలించే చర్యలు చేపట్టారు. గత కొద్ది నెలలుగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెవెన్యూ శాఖలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మే నెలలో ఎల్లారెడ్డిపేట మండల సర్వేయర్ లంచం కేసులో పట్టుబడగా, తాజాగా సిరిసిల్ల సర్వేయర్ వేణు ఏసీబీ ట్రాప్‌లో చిక్కడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.జిల్లా ప్రజలు అధికారుల అవినీతి ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఏసీబీ దాడులు జరుగుతున్నా రెవెన్యూ అధికారుల వైఖరి మారడం లేదు. ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.ఏసీబీ వర్గాలు మాత్రం ఇలాంటి అవినీతి చర్యలపై సున్నా సహన విధానం పాటిస్తామని స్పష్టం చేశాయి. రాబోయే రోజుల్లో జిల్లాలో మరిన్ని తనిఖీలు కొనసాగుతాయని విశ్వసనీయ సమాచారం.రాజన్న సిరిసిల్లలో వరుసగా రెవెన్యూ సిబ్బందిపై చర్యలు జరుగుతుండటంతో, ప్రజా వర్గాల్లో ఆశాజనక వాతావరణం నెలకొన్నప్పటికీ, అవినీతి పూర్తిగా నిర్మూలించాలంటే అధికారుల దృక్పథంలో మార్పు తప్పనిసరి అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న రాజనాల శ్రీహరి


వరంగల్ (ఆకాంక్ష) : హైదరాబాద్ ఏఐసీసీ ప్రతినిధి అవి జ్యోత్ పట్నాయకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజనాల శ్రీహరి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల రాజకీయ నేపథ్యంలో ప్రజలకు పార్టీకి సంబంధాలతో సేవ కార్యక్రమంలో పాలుపంచుకొని ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకు వెళ్తానని కోరానన్నారు. దీన్ని స్పందించిన ఏఐసిసి ప్రతినిధి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పూలపాక వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్ .రాజీవ్ యూత్ జిల్లా అధ్యక్షుడు సోలో విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## షాపింగ్ కాంప్లెక్స్ అభివృద్ధి పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

గోదావరిఖని,అక్టోబర్ 14,(ఆకాంక్ష): రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మంగళవారం గోదావరిఖని పట్టణం చౌరస్తా ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రూ.27 కోట్ల విలువైన షాపింగ్ కాంప్లెక్స్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రాజెక్టు పురోగతిని వివరణగా అడిగి తెలుసుకున్నారు.పనుల నాణ్యత,నిర్మాణ వేగం మరియు పారదర్శకతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ…"గోదావరిఖని ప్రజలకు ఆధునిక వాణిజ్య సదుపాయాలు కల్పించడమే ఈ షాపింగ్ కాంప్లెక్స్ లక్ష్యం.ఇది ఒక వైపు నగర అభివృద్ధికి దోహదం చేస్తే, మరోవైపు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి," అని అన్నారు.ఇతర అభివృద్ధి పనులతో పాటు ఈ ప్రాజెక్టు కూడా నగర ముఖచిత్రాన్ని మార్చనున్నదని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. "ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు అందించడమే మా ప్రభుత్వ ధ్యేయం.సింగరేణి, మున్సిపల్ అధికారులతో సమన్వయం కలిగిన విధంగా ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయాలని ఆదేశించాను,"అని ఆయన పేర్కొన్నారు.ఈ పర్యవేక్షన కార్యక్రమంలో సింగరేణి అధికారులు, మున్సిపల్ కమిషనర్, స్థానిక తాజా మాజీ కార్పొరేటర్లు, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. పనుల ప్రగతిపై అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు.

## హైదరాబాద్ జిల్లా కెమిస్ట్స్ & డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్

**- 15 వ తేది బుధవారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు నామినేషన్**
**- 30వ తేది ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్**



హైదరాబాద్ అక్టోబర్ 14 (ఆకాంక్ష): హైదరాబాద్ జిల్లా కెమిస్ట్స్ & డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది.15 వ తేది బుధవారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు నామినేషన్ స్వీకరణ అదీ తేది పరిశీలన ,ఉపసంహారణ, అభ్యర్థుల ఫైనల్ జాబితా విడుదల కానుంది. 30వ తేది ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుపనున్నట్లు ఎన్నికల అధికారి టి. రాజశేఖర్ తెలిపారు.తేది 15.10.2025 బుధవారం రోజున ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు నామినేషన్ పత్రాలు ఇచ్చుట, నామినేషన్ స్వీకరణ: తేదీ 15.10.2025 బుధవారం రోజున ఉదయం 11గంటల నుండి 11.30 గంటల వరకు, నామినేషన్ల పరిశీలన: తేదీ 15.10.2025 బుధవారం రోజున ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, నామినేషన్ల ఉపసంహరణ: తేదీ 15.10.2025 బుధవారం రోజున ఉదయం 12 గంటల నుండి 12.30 గంటలవరకు తదుపరి అభ్యర్థుల ఫైనల్ జాబితా,పోలింగ్ తేదీ : 30.10.2025 ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగనుంది.పై అన్ని కార్యక్రమాలు ఎస్వీఎం గ్రాండ్ , రామంతపూర్ హైదరాబాద్ నందు నిర్వహించంన్ ఉన్నారు.

## ఈనెల 18న జరగబోయే బిసి బంద్ ను విజయవంతం చేయండి

**- బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు రమాదేవి పిలుపు**



హైదరాబాద్, అక్టోబర్ 14 (ఆకాంక్ష) : బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపు విషయంలో హైకోర్ట్ తీర్పును వ్యతిరేకిస్తూ బీసీ జేఏసి ఈనెల 18న ఇచ్చిన బిసి బంద్ ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు రమాదేవి పిలుపు నిచారు. ఈనెల 18న జరగబోయే బిసి బంద్ ను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం విద్యానగర్ నుండి ఉస్మానియ విశ్వవిద్యాలయం వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. అనంతరమం బిసి భవన్ లో మీడియా సమావేశం లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఏ.లతా, ప్రదాన కార్యదర్శి కటుకురి లక్ష్మిలతో కలిసి మాట్లాడారు.బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య ఈ నెల 18న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బందుకు పిలుపునిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.జనాభాలో 60% పైగా ఉన్న బీసీలకు విద్యా ఉద్యోగ అధిక రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బీసీలకు రిజర్వేషన్ లేకపోవడం వలన సామాజిక వెనకబాటుకు గురవుతున్నారని మండల కమిషన్ సిఫార్సుల మేరకు బీసీలకు దేశవ్యాప్తంగా రాష్ట్రాల వ్యాప్తంగా 50% పైగా రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు బీసీలు ఇప్పటికైనా చైతన్య గా ఉండి రాజ్యాధికార ఉద్యమంలో పాల్గొనాలని ఆమె పిలుపు నిచ్చారు.18న జరగబోయే బందులో వ్యాపార సంస్థలు విద్యాసంస్థలు తదితర రంగాల వారు స్వచ్ఛందంగా బందులో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు లతా సింగ్,కనినర్ మంజువాని తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఉద్యమకారుడు డొంకెన రవికి ఘన సన్మానం

**- ప్రజా ప్రభుత్వంలో ఉద్యమకారులకు న్యాయం చేయాలని డిమాండ్**



పెద్దపల్లి, అక్టోబర్ 14 (ఆకాంక్ష): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం అంబేద్కర్ విగ్రహం సమీపంలో ప్రముఖ న్యాయవాది, సీనియర్ తెలంగాణ ఉద్యమ నాయకుడు డొంకెన రవిని ఘనంగా సన్మానించారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్గా ఆయన నియమితులవ్వడంతో ఈ సన్మానం జరిగింది. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ డొంకెన రవి న్యాయ రంగంలో అహర్నిశలు కృషి చేస్తూ ప్రజల న్యాయహక్కుల కోసం పోరాడుతున్నారని పేర్కొన్నారు. ఆయన నియామకం పెద్దపల్లి జిల్లాకే కాకుండా మొత్తం తెలంగాణ ఉద్యమకారులకూ గర్వకారణమని అభిప్రాయపడ్డారు. సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయన ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు.ఇక ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని, వారికోసం 250 గజాల ఇంటి స్థలాలు, పెన్షన్ సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. అంతే కాకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో, కాంగ్రెస్ పార్టీలో ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద తమ మిత్రుడు డొంకెన రవికి ఘన సన్మానం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బత్తుల శంకర్, డాక్టర్ మంద భాస్కర్ యాదవ్, ఉపాధ్యక్షులు చర్లపల్లి సురేష్ గౌడ్, కందుల అశోక్ పటేల్, గుర్రాల వీరేశం, దామ సదయ్య, లలిత ఠాగూర్, పొల్లూరి స్వామి, మూల మల్లేశం, కేశవరెడ్డి, పుల్లూరి ప్రేమ్ సాగర్, గడ్డం లక్ష్మి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం





గోదావరిఖని (ఆకాంక్ష) : గోదావరిఖనిలోని కాకతీయ జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. వాణిశ్రీ ఆధ్వర్యంలో "సి.పి.ఆర్ (కార్డియో పల్మనరీ రెసుసిటేషన్)" పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సీపిఆర్ చేసే విధానము పై డెమానిస్ట్రేషన్ చేసి చూపించారు. తదనంతరం ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డా. వాణిశ్రీ మాట్లాడుతూ.. ఆకస్మికంగా గుండె ఆగిపోయిన వ్యక్తిని గమనించిన వెంటనే శ్వాస కొనసాగుతున్నదా లేదా పరిశీలించాలని వెంటనే 108 కు సమాచారం ఇచ్చి, సిపిఆర్ చేయడంతో గుండె ఆగిన వ్యక్తికి పునర్జీవనం కల్పించవచ్చని అన్నారు. ఇది సాధారణ పౌరులు కూడా నేర్చుకొని, అవసరమైన సమయంలో ప్రాణాలు కాపాడగలిగే విధంగా ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డా. ఆర్. రాజమౌళి, డా. బి. కిరణ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ , అధ్యాపకులు, ఎన్సిడి సిబ్బంది ఏ. మధుసూదన్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




## రికవరీ చేసిన మొబైల్ ఫోన్‌ను బాధితునికి అందజేసిన ఎస్సై దీకొండ రమేష్

ఓదెల, అక్టోబర్ 14 (ఆకాంక్ష): పోత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను పోలీసులు రికవరీ చేసి యజమానికి అందజేశారు.వివరాల్లోకి వెళ్తే..పోత్కపల్లి గ్రామానికి చెందిన పిట్టల మహేష్ అనే వ్యక్తి తన ఆపిల్ కంపెనీ మొబైల్ ఫోన్‌ను ఇటీవల కోల్పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుపై ఎస్సై దీకొండ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు శ్రమించి ఆ మొబైల్ ఫోన్‌ను రికవరీ చేశారు. అనంతరం సదరు ఫోన్‌ను బాధితుడు మహేష్‌కు అందజేశారు. రికవరీ చేసిన ఆపిల్ మొబైల్ విలువ సుమారు రూ.45,000/-గా ఉంది.ఈ సందర్భంగా ఎస్సై దీకొండ రమేష్ మాట్లాడుతూ ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్నప్పుడు వెంటనే పోర్టల్ (www.ceir.gov.in) ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. పోర్టల్‌లో ఫోన్ వివరాలు నమోదు చేస్తే, పోలీసులు మొబైల్‌లను త్వరగా గుర్తించి రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ సేవను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై రమేష్ పిలుపునిచ్చారు.


## 13 నెలల పసికందుపై కామాంధుడు అత్యాచారం

**- ఆపై చంపేసి పొలంలో పాతిపెట్టిన వైనం**



పాణిసాగర్,అక్టోబర్ 14 (ఆకాంక్ష ): పసికందుపై కామాంధుడు అత్యాచారం చేసి అనంతరం చంపేసి పొలంలో పాతి పెట్టాడు. ఈ సంఘటన త్రిపుర రాష్ట్రం పాణిసాగర్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం… అస్సాం రాష్టం నిలంబజార్‌కు చెందిన జలాల్ ఉద్దిన్ అనే వ్యక్తి పాణిసాగర్‌లో కూలీగా పని చేస్తున్నాడు. ఓ మహిళ నుంచి 14 నెలల పాపను తీసుకొని బయట ఆడిస్తానని నమ్మించాడు. అనంతరం గ్రామ శివారులోకి తీసుకెళ్లి పాపపై అత్యాచారం చేసి చంపేశాడు. అనంతరం పాపను పొలంలో పాతిపెట్టిపారిపోయాడు. మూడు గంటల నుంచి పాపను జలీల్ తీసుకరాకపోవడంతో తల్లి చిన్నారి కోసం వెతకడం ప్రారంభించింది. గ్రామస్థులు అందరూ పాప కోసం వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులో పొలంలో పాతిపెట్టిన పాప మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులు మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## లొంగిపోయిన మావోయిస్టు నేత వేణుగోపాల్‌పై కుటుంబ సభ్యుల ఆనందం



పెద్దపల్లి,అక్టోబర్ 14(ఆకాంక్ష) : సిపిఐ మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ లొంగిపోవడంపై పెద్దపల్లి జిల్లాలోని ఆయన కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వేణుగోపాల్ జీవితంలో ఇది కొత్త మార్పుగా కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.వేణుగోపాల్ స్వస్థలం పెద్దపల్లి పట్టణంలోని మల్లోజుల కుటుంబ సభ్యులు వార్త తెలుసుకున్న వెంటనే ఆనందభాష్పాలు పెట్టారు. ఆయన అన్నయ్య మల్లోజుల ఆంజనేయులు కుమారుడు దిలీప్ శర్మ మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాలుగా అడవుల్లో జీవించిన మా బాబాయి ఇప్పుడు సాధారణ జీవితాన్ని ఎంచుకోవడం మాకు ఎంతో ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులందరికీ ఇది హర్షదాయకమైన విషయం అని ఆయన ఆరోగ్యంగా సుఖంగా ఉండాలని కోరుకుంటున్నాం అని తెలిపారు.అలాగే ప్రభుత్వం మావోయిస్టుల పునరావాసానికి చేస్తున్న కృషి అభినందనీయమని దిలీప్ శర్మ పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలు మరింత మందిని సాధారణ జీవితంలోకి రానిచ్చే దిశగా ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. వేణుగోపాల్ లొంగిపోయిన విషయం పెద్దపల్లి పట్టణంలో చర్చనీయాంశమైంది. స్థానికులు ఆయన నిర్ణయాన్ని స్వాగతిస్తూ కుటుంబం మళ్లీ కలిసినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్ల తర్వాత మల్లోజుల కుటుంబంలో ఆనందం నెలకొంది…

# ఆశ నోడల్ సూపర్వైజర్ ల  సమీక్ష సమావేశం

### - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వాణిశ్రీ





పెద్దపల్లి,అక్టోబర్ 14,(ఆకాంక్ష): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం లో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వాణిశ్రీ, ఆశ నోడల్ సూపర్వైజర్ ల%జ% సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాతా ఆరోగ్య,పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలను గర్భధారణ అయిన మొదటి మూడు నెలల్లోనే నమోదు చేయాలి అని,వీరికి అన్ని అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్దేశిత సమయాల్లో పూర్తి చేయాలని సూచించారు. అలాగే ప్రసూతి సేవల కోసం ప్రభుత్వ హాస్పిటల్ను ప్రాధాన్యత ఇచ్చుటకు ప్రభుత్వ ఆసుపత్రుల లో లభించే ఉచిత సేవలు అయిన టిఫ్ఫా స్కాన్,రక్త పరీక్షలు, స్పెషల్ రూమ్స్ సౌకర్యం 24 గంటల డాక్టర్స్ పర్యవేక్షణ,ప్రసూతి శిక్షణ పొందిన వైద్య సిబ్బంది గురించి తెలియ జేయాలి అని అన్నారు.గర్భిణీ స్త్రీలు వైద్య పరీక్షల నిమిత్తంగా,ప్రసూతి కోసం "102" వాహన సేవను ఆశల ద్వారా వినియోగించు కునేల  చేయాలి అని తెలిపారు. ప్రతిరోజూ జరాల సర్వే నిర్వహించాలి,అనుమానిత కేసులను పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పంపించి, రక్త పరీక్షలు ఉచితంగా "టీ హబ్" ద్వారా చేయించవచ్చని వివరించారు.వారానికి పైగా దగ్గు,జ్వరం,బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారిని క్షయ వ్యాధి నిర్ధారణ కోసం తెమడ పరీక్షలు చేయించాలి.అవసరమైతే ఎక్స్ రే పరీక్షలు చేయించి తగిన చికిత్స అందించాలన్నారు.ఎన్.సీ.డి స్క్రీనింగ్ లు నిర్వహించాలని,రక్తపోటు, మధుమేహం గల వారికి సకాలం లో మందులు అందించాలి అని అన్నారు.రెగ్యులర్ ఫాలో అవ్ చేయాలి అని అన్నారు.బుధవారం,శనివారం షెడ్యూల్ ప్రకారం వ్యాధి నిరోధక టీకాల కార్య కార్యక్రమంలు నిర్వహించాలి అని అన్నారు.వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని,లక్ష్యాలను సాధించని సిబ్బంది వారి పనిని మెరుగు పరుచుకోవాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి కేసుల కు పోషకాహార కిట్ లను అందించారు.సిపిఆర్ పై అవగాహన కల్పించారు.ఈ సమావేశం ఆశ నోడల్ సూపర్వైజర్లకు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బందికి సిపిఆర్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఇందులో సిపిఆర్ చేసే విధానము ను ప్రదర్శన ద్వారా చూపించారు.ఈ సమీక్ష సమావేశంలో వైద్య అధికారి డాక్టర్ లక్ష్మి భవానీ,జిల్లా ఆశ నోడల్ అధికారి,దయామని,సి. ఎచ్ఓ.ఉమా మహేష్,ఎన్ సి డి నోడల్ సూపర్వైజర్ ఏ.మధుసూదన్,ఇతర ఆరోగ్య శాఖ అధికారులు,ఆశా నోడల్ సూపర్వైజర్ లు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులనే వీధి బాట పట్టించిన కూతురు

### - కలెక్టర్ను ఆశ్రయించిన వృద్ధా దంపతులు

తూర్పుగోదావరి,అక్టోబర్ 14 (ఆకాంక్ష) : కన్న ప్రేమ కంటే పెంచిన ప్రేమ గొప్పది అని పెద్దలు చెప్పిన మాటలను అక్షరాలా తలదన్నే సంఘటన తూర్పుగోదావరి జిల్లాలో చోటు చేసుకుంది. తాము లేని పిల్లల ప్రేమ కోసం బంధువుల అమ్మాయిని పెంచి, చదివించి, పెళ్లి చేసి, ఆస్తి కూడా రాసిచ్చిన దంపతులు చివరికి ఆమె చేతిలో మోసపోయారు. తల్లిదండ్రుల్లా చూసుకున్న వారినే వీధి బాట పట్టించే పరిస్థితులు సృష్టించింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం మొగళ్లమూరు గ్రామానికి చెందిన వెంకటనర్సయ్య, లక్ష్మి దంపతులు అనాథలై పోయారు. సొంత ఊరిని వదిలి బతుకుదెరువు కోసం అండమాన్ దీవులకు వెళ్లి టైలరింగ్ వృత్తితో జీవనం సాగించిన వీరు, కష్టార్జిత ధనంతో స్వగ్రామంలోనే 18 సెంట్ల భూమిని కొనుగోలు చేసి గృహనిర్మాణం చేసుకున్నారు. కానీ వారికి సంతానం లేకపోవడంతో బంధువుల కుమార్తె జ్యోతిని పెంపుడు కూతురుగా దత్తత తీసుకుని ఎంతో మమకారంగా పెంచారు. ఆమెకు అక్షరాస్యత కల్పించి, తల్లిదండ్రుల ప్రేమను పంచి, చివరికి వీరవెంకట సత్యనారాయణ అనే యువకుడితో ఘనంగా వివాహం కూడా జరిపించారు.పెళ్లి అనంతరం కాలక్రమేణా జ్యోతిలో మార్పులు కనిపించాయి. తల్లిదండ్రుల్లా చూసుకున్న వెంకటనర్సయ్య, లక్ష్మిదంపతుల ఆస్తిపాస్తులపైనే కన్నేసింది. మొదట సున్నితంగా కోరుతూ, తరువాత ఒత్తిడి తెచ్చి తండ్రి పేరుమీద ఉన్న పొలాన్ని తన పేరున రాయించుకుంది.దంపతులు పెంచిన కూతురే కదా అనే అనుభూతితో ఎలాంటి అనుమానం లేకుండా ఆస్తి ఆమె పేరుమీద రిజిస్ట్రేషన్ చేశారు. అంతటితో ఆగకుండా అండమాన్లో తండ్రి పేరు మీద ఉన్న షాపులను కూడా స్వాధీనం చేసుకుని అద్దె రూపంలో వచ్చే డబ్బులను సైతం తానే వాడుకోవడం ప్రారంభించింది.ఇంతవరకు అయినా బాగానే ఉందనుకున్నారు. వృద్ధ దంపతులు కాని తాజాగా జ్యోతి తన తల్లిదండ్రులు నివసిస్తున్న ఇంటినీ తన పేరుమీద రాయించాలని ఒత్తిడి చేయడం మొదలుపెట్టడంతో అసలు స్వరూపం బయటపడింది. ఈ వ్యవహారంపై తీవ్ర ఆవేదనకు గురైన వెంకటనర్సయ్య, లక్ష్మి దంపతులు చివరకు జిల్లా కలెక్టర్ను ఆశ్రయించారు. తాము వృద్ధాప్యంలో ఉన్నామని, శారీరక సమస్యలతో బాధ పడుతున్నామని, అయినా కూడా కూతురు, అల్లుడు తమ గురించి ఒక్కసారి కూడా వెనక్కి తిరిగి చూడలేదని వాపోయారు. వృద్ధ దంపతులు కలెక్టర్కు సమర్పించిన ఫిర్యాదులో, "మా ఆస్తులన్నీ కూతురు జ్యోతి పేరుమీద రాసిచ్చాం. ఆమె మా వృద్ధాప్యంలో ఆదుకుంటుందనుకున్నాం. కానీ ఇప్పుడు మా డబ్బులు, భూములు షాపులు అన్నీ కాజేసి, ఇంటికీ ఎసరు పెడుతోంది. మేము వీధి బాట పట్టే స్థితికి చేరుకున్నాం. మా పేరుమీద ఉన్న ఆస్తిని తిరిగి మాకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.స్థానికులు ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులుగా చూసుకున్న వారిని వృద్ధాప్యంలో ఇలాగే వదిలేయడం అమానుషమని, చట్టపరంగా దంపతులకు న్యాయం జరగాలని కోరుతున్నారు. ప్రస్తుతం కలెక్టర్ కార్యాలయం ఈ అంశాన్ని పరిశీలనలోకి తీసుకుంది.ప్రేమ, మమకారం పేరుతో నడిచిన ఈ కథ చివరికి మోసం, మానవత్వం కోల్పోయిన ద్రోహంగా మారింది. కన్న కూతురు చేయకపోయిన పని పెంచిన కూతురు చేయడం సామాజికంగా చర్చనీయాంశంగా మారింది. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో చూసుకుంటుందన్న నమ్మకంతో ఆస్తులు రాసిచ్చిన వెంకటనర్సయ్య, లక్ష్మి దంపతులు ఇప్పుడు అధికారుల సానుభూతి కోసం ఎదురుచూస్తున్నారు.

# పరామర్శకు వెళ్లి పరువు తీసుకున్న బీజేపీ నేతలు

### - రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలోనే తగాదా

### - పార్టీ ప్రతిష్ఠకు చెడ్డ పేరుతో ముగిసిన పరామర్శ



మంచిర్యాల,అక్టోబర్ 14 (ఆకాంక్ష): మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు ఏటా మధుకర్ కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పర్యటనలో చోటుచేసుకున్న అవాంఛనీయ ఘటన ఇప్పుడు రాష్ట్ర బీజేపీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. పార్టీ గౌరవాన్ని మట్టిపాలు చేసేలా రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలోనే ఇద్దరు కీలక నాయకులు ఒకరిపై ఒకరు దూకుడుగా ప్రవర్తించటం పార్టీ లోపలి విభేదాలను బహిర్గతం చేసింది. రామచందర్ రావు బృందం ఉదయం నీల్వాయి గ్రామానికి చేరుకుంది. ఆయనతో పాటు పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత, జిల్లా ఇంచార్జ్ గోమాస శ్రీనివాస్, స్థానిక నేతలు,మండల శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మధుకర్ కుటుంబాన్ని పరామర్శించి, వారి ఆవేదనను విని, పార్టీ తరపున మద్దతు ప్రకటించే కార్యక్రమం జరుగుతుండగా అకస్మాత్తుగా అవాంఛనీయ పరిణామం చోటు చేసుకుంది.రామచందర్ రావు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వేళ గోమాస శ్రీనివాస్ తన స్నేహపూర్వక ధోరణిలో "అరే వెంకటేష్"అని సంబోధించగా, వెంకటేష్ నేత ఆ వ్యాఖ్యను అవమానంగా భావించి "అరేయ్ చెంప పగులుద్ది" అంటూ మండిపడ్డారు. దీనికి ప్రతిగా గోమాస శ్రీనివాస్ కూడా ఆగ్రహంతో స్పందిస్తూ "బట్టలు ఊడదీసి కొడతా" అని బహిరంగంగా బెదిరించడం అక్కడి వాతావరణాన్ని ఉద్రిక్తంగా మార్చింది. తక్షణమే అక్కడున్న నాయకులు, కార్యకర్తలు వారిని అదుపులోకి తెచ్చి గొడవ పెరగకుండా చేశారు. ఈ ఘర్షణ జరుగుతున్నప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తన కుర్చీ నుంచి లేచి తీవ్ర ఆగ్రహంతో మనమొచ్చింది పరామర్శకు.. మీరు చేస్తున్నది పార్టీ పరువు తీసే పని!" అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంటనే ఇద్దరు నేతలను శాంతింపజేసి, ఆ తరువాత మీడియాతో మాట్లాడకుండా కార్యక్రమాన్ని ముగించారు.ఈ ఘటనతో పార్టీ శ్రేణులు సిగ్గుతో తలదించుకున్నారు. నీల్వాయి గ్రామ ప్రజలు కూడా "ఇంత బాధలో ఉన్న కుటుంబం ముందు గొడవలు ఎందుకు?" అని ఆశ్చర్యపడ్డారు. బాధిత కుటుంబం కూడా ఇంత ఘర్షణాత్మక వాతావరణంలో తీవ్ర మనోవేదనకు గురైనట్లు సమాచారం.

**బీజేపీ అంతర్గత గోడలు బహిర్గతం...**

ఈ ఘటనతో బీజేపీలో పెరుగుతున్న అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో చాలాకాలంగా వెంకటేష్ నేత, గోమాస శ్రీనివాస్ మధ్య విభేదాలు ఉన్నాయని, కార్యకర్తల నియంత్రణ, స్థానిక ఆధిపత్యం విషయంలో తగాదాలు జరుగుతున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే రాష్ట్ర నాయకత్వం వాటిని పరిష్కరించక పోవడంతో ఇప్పుడు అవి బహిరంగ స్థాయికి చేరినట్లు తెలుస్తోంది.ఇప్పటికే ఆత్మహత్య ఘటనపై రాష్ట్ర బీజేపీ తీవ్ర ఆందోళనలో ఉండగా పార్టీకి చెందిన మండల అధ్యక్షుడి ఆత్మహత్య తర్వాత, బీజేపీ నేతలు పరామర్శకు వెళ్లిన వేళ చోటుచేసుకున్న ఈ గొడవ పార్టీ ప్రతిష్ఠకు దెబ్బతీసిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**పార్టీ అధిష్ఠానం ఆగ్రహం...**


ఈ ఘటనపై రాష్ట్ర అధిష్ఠానం కూడా అసంతృప్తిగా ఉందని సమాచారం. రామచందర్ రావు హైదరాబాద్ చేరుకున్న వెంటనే ఈ విషయాన్ని కేంద్ర నాయకత్వానికి నివేదించినట్లు తెలిసింది. పార్టీ నిబంధనలను ఉల్లంఘించి, రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలోనే వాగ్వాదానికి దిగిన నేతలపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.దీంతో మండల, జిల్లా స్థాయి కార్యకర్తలు ఈ పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "మన నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలి కానీ వారు పరస్పర తగాదాలతో పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీశారు అంటూ కొంతమంది కార్యకర్తలు వ్యాఖ్యానించారు. ఈ సంఘటనతో మధుకర్ కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన పరామర్శ కార్యక్రమం రాజకీయ కలకలంగా మారిపోయింది.

**కేంద్ర నేతల దృష్టికి...**

ఈ ఘటన వీడియో క్లిప్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బీజేపీ నాయకులు బాధిత కుటుంబం ముందే గొడవకు దిగారు అంటూ కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నాయి. కేంద్ర బీజేపీ నాయకులు కూడా ఈ విషయం పై విచారణ ఆదేశించే అవకాశం ఉందని తెలిసింది.దీంతో మంచిర్యాల ఘటన కేవలం వ్యక్తిగత కోపం కాదు, బీజేపీ లోపలి విభజనల ప్రతిబింబం. పెద్దపల్లి జిల్లాలో వర్గపోరు పెరుగుతోంది. ఇలాంటి సంఘటనలు పార్టీ మానసిక స్థితిని బహిర్గతం చేస్తున్నాయి. సమయానికి క్రమశిక్షణ చర్యలు లేకపోతే భవిష్యత్తులో పార్టీకి పెద్ద నష్టం తథ్యం అని పలువురు భావిస్తున్నారు.మధుకర్ ఆత్మహత్యతో దుఃఖంలో ఉన్న కుటుంబాన్ని పరామర్శించాల్సిన సమయంలోనే బీజేపీ నేతలు తమ వ్యక్తిగత ద్వేషాలు బయటపెట్టడం రాజకీయంగా అసభ్యకరమైన ఘటనగా మారింది.రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలోనే జరిగిన ఈ ఘర్షణ బీజేపీ శ్రేణులపై చెడు ముద్ర వేసిందని రాజకీయ వర్గాలు ఏకమవుతున్నాయి.ఇప్పుడు పార్టీకి ఎదురుగా నిలిచిన ప్రశ్న ఒక్కటే పరామర్శకు వెళ్లి పరువు తీసిన నేతలను ఎలా క్రమశిక్షణలోకి తెస్తుంది బీజేపీ అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి... దీనిపై అధిష్టానం ఏం చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే...

# పిల్లలను బయటకు పంపితే కఠిన చర్యలు

### - కలెక్టర్లు వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమాన్యులతో భేటీ అవ్వాలి - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు






పెద్దపల్లి, అక్టోబర్ 14(ఆకాంక్ష) : ఫీజు బకాయిల కోసం తరగతి గదుల నుంచి పిల్లలను బయటకు పంపితే కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు మంగళవారం హైదరాబాద్ నుంచి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం పై రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్ , ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ...బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేటు పాఠశాల యాజమాన్యులు వారి బడులలో చదివే విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులకు గురి చేయడానికి వీలు లేదని అన్నారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు ప్రభుత్వం చెల్లిస్తుందని,  విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజు కట్టమని అడగటం లేదా విద్యార్థులను బయటకు పంపడం వంటి వాటికి పాల్పడితే తీవ్రంగా పరిగణించి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు.పాఠశాల నుంచి విద్యార్థులను బయటికి పంపడానికి వీలు లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమాన్యులతో సమావేశమై పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులకు గురి చేయకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కు  ఏదైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకుని రావాలని అన్నారు. సామాజిక బాధ్యతగా భావించి విద్యా రంగం పై ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం క్రమ పద్ధతిలో విడుదల చేస్తుందని, బకాయిల కోసం విద్యార్థులను అవమానించినట్లు ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.తరగతి గదిలో నుంచి పిల్లలను బయటకు పంపిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ జాబితాను కలెక్టర్ల సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు.  బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లో జరుగుతున్న పాఠ్యాంశాల బోధన, అక్కడ ఉన్న వసతులను  సైతం పరిశీలించి నివేదిక అందించాలని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ తో బెస్ట్ అవైలబుల్ స్కూల్ కింద ఎంఓయూ చేసుకునే సమయంలోనే ఫీజులను దృష్టిలో ఉంచుకొని పిల్లలను ఇబ్బంది పెట్టకూడదు అనే కండిషన్ ఉంటుందని అన్నారు. పిల్లలను బయటకు పంపడం రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కును నివారించడమేనని దీనిని తీవ్రంగా పరిగణించాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.పిల్లలను ఇబ్బందులకు గురి చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆ పిల్లలను అవసరమైతే మరో బెస్ట్ అవైలబుల్ స్కూలుకు  వెంటనే ట్రాన్స్ ఫర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..  బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లో దసరా తర్వాత పిల్లల అటెండెన్స్ గమనించాలని , పాఠశాలలు చేస్తున్న ఇబ్బందుల కారణంగా పిల్లలు వెళ్లడం లేదని అన్నారు.రాష్ట్రంలో చాలా చోట్ల పిల్లలు ధర్నా చేసే పరిస్థితి ఉందని, దీనిని కలెక్టర్లు జిల్లా విద్యాశాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ వెంటనే నివారించాలని, సంబంధిత పాఠశాల యాజమాన్యులతో చర్చించి పిల్లలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# ఆరోగ్యం

## మాంసం తింటే కొత్త రోగం..

### చేతులు ఇలా మారిపోతున్నాయట,ఎలా గుర్తించాలంటే?

రోజు రోజూ మారుతున్న జీవన విధానానికి అనుగుణంగా ప్రతిరోజూ కొత్త కొత్త రోగాలు వస్తున్నాయి. అసలు కొన్ని వ్యాధులు ఎందుకు వస్తున్నాయో కూడా అర్థంకానీ పరిస్థితుల్లో మనం జీవిస్తున్నాం. మరీ ముఖ్యంగా కరోనా తరువాత ఎలాంటి చిన్న వ్యాధి వచ్చినా ప్రజలందరూ కంగారు పడిపోతున్నారు. అయితే మన శరీరంలో ఉండే కొవ్వు కారణంగా కూడా అనేక సమస్యలు వస్తాయన్న విషయం తెలిసిందే. అయితే, అమెరికాలోని ఫ్లోరిడాలోని టంపా ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి శరీరంలో నుంచి కొవ్వు లీక్ అవుతుందట. ఈ విస్మయకరమైన మార్పులను చూసి, ఆందోళన చెందిన ఆ వ్యక్తి వెంటనే వైద్యులను సంప్రదించాడు. దీంతో వైద్యులు అతనికి దానికి సంబంధించిన ఆందోళనతో వైద్యులను సంప్రదించాడు.

**చేతులు, కాళ్ల ద్వారా కొలెస్ట్రాల్ లీక్ అవడం:** జామా కార్డియాలజీ జర్నల్‌లో ప్రచురితమైన కథనం ప్రకారం అమెరికాకు చెందిన ఒక 40 సంవత్సరాల వ్యక్తి తన శరీరంలో పసుపు రంగు ఛాయలను గమనించాడు. అయితే అతను మొదటగా సాధారణమైనవే అని అనుకున్నాడు. కానీ కొద్దీ రోజుల తరువాత అవి మరింత పెరిగిపోయాయి. దీంతో ఆ వ్యక్తి టంపా జనరల్ హాస్పిటల్‌కు వెళ్లి వైద్యులను సంపాదించారు. దీంతో అతడిలో విచిత్రమైన ఆరోగ్య పరిస్థితిని కనుగొన్నారు. వైద్యులు ఏం చెప్పారు?

ఆయన పూర్తి మెడికల్ రిపోర్టులు పరిశీలించిన తరువాత, వైద్యులు అతనిలో అత్యధిక స్థాయిలో కొవ్వు పదార్థాలు ఉండడం వల్ల ఈ



సమస్యలు ఏర్పడ్డాయని చెప్పారు. అతను అనుసరించిన కీటోజెనిక్ డైట్ కారణంగా, శరీరంలో ఎక్కువ కొవ్వు, కొలెస్ట్రాల్ పెరిగాయి. దీంతో అతని శరీరం నుంచి కొవ్వు పదార్థాలు లీక్ అవడం ప్రారంభమవుతుందని చెప్పారు.

కొలెస్ట్రాల్ ప్రభావం అతనికి చర్మంలో పసుపురంగు ఛాయలు కనిపించినప్పటికీ, వైద్యులు ఈ లక్షణాలను "క్సాంథెలాస్మా"గా నిర్ధారించారు. ఇది శరీరంలోని కొవ్వు నిల్వలు.. చర్మం కింద ఉత్పత్తి కావడం వల్ల ఏర్పడుతుంది. ఇది ప్రమాదకరమైనది కాదు, కానీ అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు అథెరోస్క్లెరోసిస్ వంటి సమస్యలకు దారితీస్తాయి. ఈరుగ్మతలో, కొలెస్ట్రాల్ ధమనుల గోడలపై పేరుకుపోవడం వల్ల రక్త ప్రవాహం తగ్గిపోతుంది, ఇది గుండె జబ్బులకు, ఇస్కీమిక్ స్ట్రోక్ లాంటి తీవ్రమైన పరిస్థితులకు కారణం కావచ్చు.

**మాంసాహారం యొక్క ప్రమాదాలు:** హార్వర్డ్ మెడికల్ స్కూల్ ప్రకారం, ఎక్కువ కాలం మాంసాహారం తీసుకోవడం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడటం, బోలు ఎముకల సమస్యలు, మూత్రపిండాల పనితీరు తగ్గడం వంటి సమస్యలకు కారణం అవుతుంది. మాంసాహారం ఆరోగ్య ప్రయోజనాలను అందించినప్పటికీ, అది ఎక్కువ మోతాదులో, ఎక్కువ కాలం తీసుకోవడం వల్ల ఆరోగ్యపరమైన జబ్బులు కూడా రావచ్చు.

## మన పూర్వికులు వండే మటన్ కూర

**ప్రస్తుతం ఉన్న ఉద్యోగ ఒత్తిడి, కాలుష్యం, ఇతర కారణాల వలన చాలా మంది పాతకాలంలో ఎలా జీవించేవారో అలానే జీవించాలని అనుకుంటున్నారు. అందుకోసం ఫామ్ హౌస్‌లు కట్టుకొని మరీ ఉంటున్నారు. అలాగే ఆర్గానిక్ అంటూ.. పాతకాలం నాటి ఆహారం తినడానికి ఇష్టపడుతున్నారు. అలాంటి వాటిలో ఒకటే మటన్. గతంలో మటన్ కూరను చాలా సాంప్రదాయకమైన పద్ధతిలో చేసుకునేవారు. ఆర్గానిక్ మసాలాలు కలిపి ఈ కూరను తయారు చేసుకునే వారు. ఈ స్టోరీలో మన పూర్వికులు ఏ విధంగా మటన్ కూరను వండుకునేవారో తెలుసుకుందాం.**

పూర్వీకుల మాదిరిగా మటన్ కూర వండుకోవడానికి కావాల్సిన పదార్థాలు : 1 కేజి మటన్ 2 ఉల్లిపాయలు 2 టమోటాలు 1 అల్లం వెల్లుల్లి పేస్ట్ 2 పచ్చిమిర్చి 1, ధనియాల పొడి 1 స్పూను, జీలకర్ర పొడి 1 స్పూను, గరం మసాలా 1/2 స్పూను, పసుపు 1/2 స్పూను కారం రుచికి సరిపడా ఉప్పు 2 స్పూన్లు, నూనె కొత్తిమీర మటన్ కూర తయారీ విధానం ముందుగా మటన్ ను శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా చేసుకోవాలి. ఉల్లిపాయలు, టమోటాలను కూడా చిన్నగా కట్ చేసుకోవాలి. ఒక గిన్నెలో మటన్, ఉల్లిపాయలు, టమోటాలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, పసుపు, కారం, ఉప్పు మరియు నూనె వేసి బాగా



కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక గంట పాటు నానబెట్టాలి. ఒక మట్టి పాత్ర తీసుకొని నానబెట్టిన మటన్ మిశ్రమాన్ని వేసి 2 కప్పుల నీరు పోసి ఒక 30 నుంచి 40 నిమిషాల పాటుఉడికించాలి. ఆ తర్వాత మూత తీసి కూరను బాగా కలుపుకోవాలి. చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేసి వేడి వేడిగా అన్నం లేదా రోటీతో సర్వ్ చేయాలి. అంతే ఎంతో రుచికరమైన మటన్ కూర సిద్ధమైనట్లే.

## ఉల్లిపాయ పులుసు,ఒక్కసారి తింటే సాంబార్‌ని మర్చిపోతారు, ఎలా చేసుకోవాలో తెలుసా?



చాలా మందికి సాంబార్ లేదా పచ్చి పులుసు ఇష్టం ఉంటుంది. అవి లేకుండా ముద్ద కూడా తినని వాళ్ళు చాలా మంది ఉంటారు. మరీ ముఖ్యంగా శాఖాహార ప్రియులకు ఇది ఎంతో ఇష్టమైన వంటకం. అలాంటి పులుసులో ఉల్లిపాయ పులుసు ఒకటి. ఇది చాలా ప్రాచీనమైన వంటకం. అలాగే ఎంతో మందికి ఇష్టమైనది కూడా. ఇది సులభంగా తయారైపోయే ఒక ప్రాచీన వంటకం. దీనిని ఎలా తయారు చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

ఉల్లిపాయ పులుసు తయారీకి కావాల్సిన పదార్థాలు: చిన్న ఉల్లిపాయలు – 15 చింతపండు – చిన్న నిమ్మపండు సైజు అంత నూనె – 3 టేబుల్ స్పూన్లు ఆవాలు – 1/2 టీస్పూన్ మెంతులు – 1/4 టీస్పూన్ కరివేపాకు – 2 రెబ్బలు ఎండుమిర్చి – 4 పసుపు – 1/4 టీస్పూన్ కారం – 1/2 టీస్పూన్ ధనియాల పొడి – 1 టీస్పూన్ జీలకర్ర పొడి – 1/2 టీస్పూన్ ఉప్పు – రుచికి తగినంత బెల్లం – చిన్న ముక్క

ఉల్లిపాయ పులుసు తయారీ విధానం: ముందుగా చింతపండును నానబెట్టి పులుసు తీసుకోండి. చిన్న ఉల్లిపాయలను పొట్టు తీసి సగానికి కట్ చేసుకోండి. స్టవ్ మీద ఒక గిన్నెలో నూనె వేడి చేసి ఆవాలు, మెంతులు, కరివేపాకు, ఎండుమిర్చి వేసి వేయించండి. ఆ తరువాత అందులో ఉల్లిపాయ ముక్కలు వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించండి. అనంతరం పసుపు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి కాసేపు వేయించండి. తరువాత చింతపండు పులుసు, ఉప్పు, బెల్లం వేసి బాగా కలపండి. పులుసు చిక్కబడే వరకు ఉడకనివ్వండి. రుచి చూసుకుని, దించుకొని వేడి వేడి అన్నంలో వడ్డించుకుంటే ఎంతో రుచికరమైన ఉల్లిపాయ పులుసు సిద్ధమైనట్లే.

## ఈ చట్నీ తింటే మీ బాడీలో చెడు కొవ్వు ఉండదు

# గుండె జబ్బులు కూడా రావు

మారిన జీవన శైలి, మారుతున్న తినే ఆహారం, ఇతర అలవాట్ల కారణంగా ఈ మధ్య కాలంలో గుండె జబ్బులతో మరణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోతుంది. గుండె సమస్యలు రావడానికి ముఖ్యమైన కారణం చెడు కొలెస్ట్రాల్ శరీరంలో పేరుకుపోవడం. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వలన, అధిక రక్తపోటు, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్స్ వంటి వ్యాధులు వస్తున్నాయి. ఈ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవడానికి చాలా మంది రకరకాల డైట్స్, వర్క్ ఔట్స్ చేస్తుంటారు. అయితే ఎవరికైతే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోయుందో వారు ఈ చట్నీలను తినడం వలన అనేక మంచి ప్రయోజనాలను పొందుతారు. అలాగే వారికి ఎటువంటి ఆరోగ్య సమస్య కూడా రాదు. ఆ చట్నీలు ఏంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.



పుదీనా పచ్చడి పుదీనా పచ్చడిలో ఫైబర్, క్లోరోఫిల్ ఉంటాయి. ఇవి జీర్ణక్రియకు ఉపయోగకరంగా ఉంటాయి. ఈ పచ్చడిని తీసుకోవడం ద్వారా చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. రోజుకు ఒకసారి ఈ పచ్చడిని మీ డైట్‌లో చేర్చుకోవడం మంచిది. ఇవి జీర్ణక్రియను మెరుగుపరిచి, శరీరంలో ఉండే చెడు కొవ్వును కరిగించడానికి సహాయపడతాయి.

మెంతికూర పచ్చడి మెంతి ఆకులతో తయారు చేసిన పచ్చడిలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. మెంతి పచ్చడిలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. శరీరాన్ని చల్లబరుస్తుంది. దీనితో పాటు మీరు మెంతి ఆకులతో పచ్చడి మాత్రమే కాకుండా పలు వంటలు కూడా చేసుకోవచ్చు. పాలకూర పచ్చడి పాలకూరలో పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు ఉంటాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ధమనుల్లో రక్తగడ్డలు ఏర్పడకుండా చేస్తుంది. పాలకూర ఆకులు, కొత్తిమీర, పుదీనా కలిపి ఈ చట్నీ తయారుచేయవచ్చు. బతువా చట్నీ బతువాలో ఉన్న ఫైబర్, రఫ్టేజ్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించవచ్చు, అలాగే జీర్ణవ్యవస్థను కూడా సక్రమంగా ఉంచుకోవచ్చు. కరివేపాకు చట్నీ కరివేపాకులో ఉన్న యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ ఔషధ గుణాలు చెడు కొలెస్ట్రాల్ నియంత్రణలో సహాయపడతాయి. ఈ చట్నీ కూరగాయల్లో చేర్చుకొని తయారుచేసి తినవచ్చు. అలాగే నేరుగా కరివేపాకుతో పచ్చడి చేసుకొని కూడా తీసుకోవచ్చు. మీ బ్రేక్ ఫాస్ట్‌కి దోశ, ఇడ్లీ, ఉప్మా వంటివి ఈ చట్నీలతో తినడం ద్వారా మీరు మంచి బలిష్టమైన ఆరోగ్యాన్ని పొందగలుగుతారు.

# సినిమా న్యూస్

# 51లో కూడా చెక్కు చెదరని అందం.. గ్లామర్ తో ఆకట్టుకుంటూ!




కొంతమంది హీరోయిన్లు ఎంత ఏజ్ పెరిగినా కూడా ఇంకా పాతికేళ్లు కూడా నిండని అమ్మాయిలాగే కనిపిస్తారు. అయితే ఇప్పుడు మనం చెప్పుకోబోయే హీరోయిన్ అచ్చం అలాగే కనిపిస్తోంది. అందమే అసూయ పడేంత అందంగా ఉన్న ఈ ముద్దుగుమ్మ ఏజ్ 51.. కానీ చూస్తే మాత్రం పాతికేళ్ల అమ్మాయిలాగే కనిపిస్తోంది. మరి ఇంతకీ ఆ ముద్దుగుమ్మ ఎవరో కాదు.. బాలీవుడ్ నటి ఊర్మిళ మతోంద్కర్.. 90'%o% లో ఇండియన్ సినీ హిస్టరీని ఒక ఊపు ఊపిన ఊర్మిళ మతోంద్కర్ తాజాగా ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఇచ్చిన దీపావళి పార్టీలో మెరిసింది. ఈ పార్టీలో ఎంతో మంది సీనియర్ హీరోయిన్లు,ఇప్పటి జనరేషన్ హీరోయిన్లు పాల్గొన్నారు. కానీ వారందరిలో ఊర్మిళ మతోంద్కర్ తన డ్రెస్సింగ్ స్టైల్ తో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది.. అంతేకాదు తాజాగా ఆ ఫోటోలను ఊర్మిళ తన సోషల్ మీడియా ఖాతాలో కూడా షేర్ చేసి "%+శ్రీఠ్వతీ.. +శ్రీఖఎశీబతీ.. క్షుతీం అఅ ాశ్రీశ్రీ ష్ట్రవఅతీ +శ్రీశీతీఎ%" అనే క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఊర్మిళ మతోంద్కర్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన ఫోటోలు చూసిన ఆమె అభిమానులు హాట్ గా ఉన్నారంటూ ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. అంతేకాదు ఇంత ఏజ్ వచ్చినా ఇంకా ఇంత అందాన్ని ఎలా మెయింటైన్ చేస్తున్నారు అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఎద అందాలు హైలైట్ అయ్యేలా ఫుల్ వర్క్ తో ఉన్న టాప్ తో ఊర్మిళ అందం మరింత రెట్టింపు అయింది. ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఇచ్చిన పార్టీలో చాలామంది సీనియర్ కథానాయికలు, యువ కథానాయికలు అందరూ వెరైటీ వెరైటీ డ్రెస్సింగ్ స్టైల్స్ తో ఎంట్రీ ఇచ్చారు. అంతమంది హీరోయిన్లు ఒకే దగ్గర కనిపించడంతో దీపావళి పండగ రాకముందే దీపావళి వైబ్ వచ్చిందని ఆ ఫొటోస్ చూసిన చాలామంది కామెంట్లు పెడుతున్నారు. ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా ప్రతి ఏడాది ఇలాగే దీపావళికి ముందు తన ఇంట్లో చాలామంది సెలబ్రిటీలకు పార్టీ ఇస్తూ ఉంటారు. అలా ఈ ఏడాది కూడా దీపావళి కి వారం ముందే సెలబ్రిటీలందరికీ పెద్ద




పార్టీ ఇచ్చారు. ఈ పార్టీలో ముకేశ్ అంబానీ భార్య నీతా అంబానీ, ఆమె కోడలు రాధికా మర్చంట్ తో పాటు సీనియర్ హీరోయిన్స్ రేఖ,ప్రీతి జింటా, హేమమాలిని, ఊర్మిళ మతోంద్కర్,కాజోల్, కరీనాకపూర్, సోనాక్షి సిన్హా, వాణి కపూర్ లతోపాటు జెనీలియా,అదితి రావు హైదరి, కృతి సనన్, అనన్య పాండే,మలైకా అరోరా, ఖుషి కపూర్,సారా అలీ ఖాన్, సుహానా ఖాన్ లు మెరిసారు. ప్రస్తుతం ఈ పార్టీకి సంబంధించిన వీడియోలు , ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే అంత మంది తారల మధ్య సీనియర్ నటి ఊర్మిళ మతోంద్కర్ చాలా స్పెషల్ గా నిలిచింది.. ఊర్మిళను అలా చూసిన ప్రతి ఒక్కరు కచ్చితంగా ఫిదా అయిపోతారు..

# రాధికకి అక్కడైనా కలిసి వచ్చేనా..?



మెహబూబా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నేహా శెట్టి. కెరీర్ ఆరంభంలో టాలీవుడ్ నుంచి ఈమెకు వచ్చిన ఆఫర్లు నిరాశనే మిగిల్చాయి. అయినా కూడా లక్ కలిసి రావడంతో సిద్దు జొన్నలగడ్డ హీరోగా చేసిన 'డీజే టిల్లు' సినిమాతో మంచి గుర్తింపు దక్కించుకుంది. ఆ సినిమా ఖచ్చితంగా నేహా శెట్టి కెరీర్‌కి టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదని అంతా అనుకున్నారు. నిజంగానే ఆ పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది, కానీ ఆ సినిమా తర్వాత నేహా కి పెద్దగా ఆఫర్లు రాలేదు, వచ్చిన ఒకటి రెండు సినిమాలు సైతం బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపించలేదు. పెద్ద హీరోల నుంచి ఈమెకు పిలుపు రాలేదు. దాంతో నేహా శెట్టి కెరీర్ టాలీవుడ్‌లో ముగిసినంత పనైంది. అలాంటి సమయంలో ఓజీలో ఐటెం సాంగ్ చేసే అవకాశం దక్కింది. అయితే ఆ పాట తీసేసి, మళ్లీ పెట్టడంతో ఉందా లేదా అన్నట్లుగానే చాలా మంది ఓజీలో నేహా శెట్టి గురించి మాట్లాడుకుంటున్నారు. గత ఏడాది టిల్లు స్క్వేర్ సినిమాలో గెస్ట్ అప్పియరెన్స్ ఇవ్వడంతో పాటు, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలో ఫుల్ హీరోయిన్ రోల్‌లో కనిపించింది. ఆ రెండు సినిమాలు సైతం నేహా శెట్టికి ఆఫర్లు తెచ్చి పెట్టలేదు. ఇప్పటికీ అభిమానులతో రాధిక అంటూ ప్రేమగా పిలిపించుకుంటున్న నేహా శెట్టి తెలుగు సినిమాల్లో ఆఫర్లు దక్కించుకోవడంలో విఫలం అవుతుంది. ఆఫర్ల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్న ముద్దుగుమ్మకు చాలా పెద్ద ఛాన్స్ డ్యూడ్ రూపంలో దక్కింది. తమిళ యంగ్ అండ్ ట్యాలెంటెడ్ హీరో ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్ సినిమాలో హీరోయిన్‌గా నేహా శెట్టి నటించడంతో కెరీర్ పై మళ్లీ ఆశలు మొదలు అయ్యాయి. డ్యూడ్ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ప్రదీప్ ప్రతి సినిమా మినిమం ఉంటుంది, ఆయనతో నటించిన హీరోయిన్స్‌కి కూడా మంచి గుర్తింపు, స్టార్‌డం దక్కిన సందర్భాలు ఉన్నాయి కనుక నేహా శెట్టి టైం మారినట్లుగా అనిపిస్తోందని అభిమానులు అంటున్నారు. ఈ వారం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న డ్యూడ్ సినిమా ప్రమోషన్‌లో నేహా శెట్టి ప్రముఖంగా కనిపిస్తోంది. ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా మమితబైజు ఉన్నప్పటికీ ఖచ్చితంగా నేహా శెట్టి పాత్రకు ప్రాధాన్యత ఉండే ఉంటుంది అనే అభిప్రాయంను ట్రైలర్ ను చూసిన వారు వ్యక్తం చేస్తున్నారు. నేహా శెట్టికి ఈ సినిమా హిట్ అయ్యి, పాత్రకు గుర్తింపు దక్కితే కోలీవుడ్ నుంచి ఆఫర్లు రావడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రాధిక తెలుగు ప్రేక్షకులను మెప్పించినా మేకర్స్ నుంచి ఆఫర్లు అందుకోలేక పోతుంది. అందమైన రూపం ఉన్నప్పటికీ ఆమెకు లక్ కలిసి రావడం లేదు. టాలీవుడ్‌లో ఆమె మళ్లీ కనిపిస్తుందా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి సమయంలో కోలీవుడ్‌లో ఈమెకు కాలం కలిసి వచ్చేనా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆమె సైతం చాలా ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. కన్నడ మూవీతో కెరీర్‌ను ఆరంభించిన నేహా శెట్టి ఆ తర్వాత వరుసగా తెలుగు సినిమాలను చేసింది. ఐదు ఆరు ఏళ్లుగా కేవలం టాలీవుడ్‌కే పరిమితం అయిన నేహా శెట్టి ఇప్పుడు కోలీవుడ్ వైపు వెళ్లడంతో ఆమెకు కెరీర్ పరంగా కలిసి వస్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ మధ్య కన్నడ సినిమా పరిశ్రమ నుంచి ఒకటి రెండు చిన్నా చితకా ఆఫర్లు వచ్చినప్పటికీ సున్నితంగా నేహా శెట్టి తిరస్కరించిందనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై క్లారిటీ రావాల్సి ఉంది. ఇప్పుడు కోలీవుడ్ నుంచి వచ్చిన ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకుని కెరీర్‌లో ముందుకు వెళ్తుందా అనేది చూడాలి. డ్యూడ్ సినిమాను ఈ వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. తమిళ్‌తో పాటు తెలుగులోనూ ఈ సినిమా విడుదల కాబోతుంది.


# రెడ్ డ్రెస్‌లో మెరుపులు కురిపిస్తోంది



తెలుగు సినిమా 'తూనీగా తునీగా'తో ఇండస్ట్రీకి పరిచయం అయిన రియా చక్రవర్తి బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తున్న సమయంలో అనూహ్యంగా హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణం కారణంగా కెరీర్ తలకిందులు అయింది. రియా చక్రవర్తి ఆ కేసు కారణంగా దాదాపు మూడు నాలుగు ఏళ్ల ఇండస్ట్రీలో కనిపించలేదు. తిరిగి ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో బిజీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా సోషల్ మీడియాలో మునుపటి ఉత్సాహంతో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ వస్తోంది. ఇటీవల వరుసగా రియా చక్రవర్తి ఫోటో షూట్స్ గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతున్న విషయం తెల్సిందే. ఇటీవలే మనం కూడా ఆమె అందాల ఆరబోత ఫోటోల గురించి మాట్లాడుకున్నాం. ఇంతలో మరోసారి తన అందమైన ఫోటో షూట్ కారణంగా రియా చక్రవర్తి సోషల్ మీడియాలో, వార్తల్లో నిలిచింది. ఈసారి రియా రెడ్ డ్రెస్‌లో అందంగా కనిపించింది. క్లీ వేజ్ షో చేస్తూ, నడుము అందాలను చూపించడం ద్వారా రియా చూపు తిప్పనివ్వడం లేదు. రెడ్ డ్రెస్‌లో నెటిజన్స్ హృదయాల్లో మెరుపులు మెరిపిస్తున్న ఈ అమ్మడు సినిమాల్లో ఖచ్చితంగా గట్టి రీ ఎంట్రీ ఇవ్వడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇలాంటి అందమైన ఫోటోలను ఫిల్మ్ మేకర్స్ చూస్తే గతంతో సంబంధం లేకుండా ఖచ్చితంగా వరుస సినిమా ఆఫర్లు ఇవ్వడం ఖాయం అని కూడా కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న రియా చక్రవర్తి పాపం కెరీర్ అర్థాంతరంగా నాశనం అయింది. ఆ సంఘటన జరిగి ఉండకుంటే ఖచ్చితంగా బాలీవుడ్‌లో ఇప్పటి వరకు టాప్ హీరోయిన్స్ జాబితాలో నిలిచేది అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి రియా చక్రవర్తి రెడ్ హాట్ డ్రెస్ ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ అందాల ఫోటో షూట్‌ను నెటిజన్స్ తెగ షేర్ చేస్తున్నారు. ఫోటోలకు వేలల్లో లైక్స్ కొడుతున్నారు. సన్నగా నాజూకుగా ఉన్న రియా చక్రవర్తి ఇప్పటికీ యంగ్ హీరోలకు జోడీగా నటించేంత అందంగా, స్లిమ్‌గా, చిన్న ఏజ్ అమ్మాయిగా కనిపిస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇదే అందాల ఆరబోత కొనసాగితే ఖచ్చితంగా బాలీవుడ్‌లో ఈమె రీ ఎంట్రీ గట్టిగానే ఉండే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం వల్లే జాన్వీ కపూర్ హిట్స్ లేకుండా కెరీర్‌లో నెట్టుకు వస్తుందని, అలాగే రియా సైతం ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలను మరిన్ని షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచి ఇప్పుడు కాకున్నా భవిష్యత్తులో అయినా మంచి సినిమా ఆఫర్లు దక్కించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఎంటీవీ ఇండియాలో వీజేగా చేయడం ద్వారా రియా చక్రవర్తి కెరీర్‌ను ప్రారంభించింది. 2012లో తెలుగు సినిమా తూనీగా తూనీగా లో నటించింది. ఆ తర్వాత హిందీలో 2013 సంవత్సరంలో మేరే డాడ్ కి మారుతి సినిమాలో కనిపించింది. కర్ణాటకకు చెందిన బెంగాలీ కుటుంబంలో జన్మించిన రియా చక్రవర్తి పాఠశాల విద్యను అంబాలా కాంట్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో చేసింది. 2009లోనే ఎంటీవీ ఇండియా లో ఛాన్స్ దక్కించుకుంది.

# ఆ స్టార్ కిడ్ పుట్టక ముందే అందరి దృష్టి...!

బాలీవుడ్‌లో అయినా మరే ఇండస్ట్రీకి చెందిన స్టార్స్ అయిన తల్లి లేదా తండ్రి అయితే మీడియా దృష్టి ఆకర్షించడం కామన్ విషయం. అదే స్టార్ కపుల్ తల్లిదండ్రులు అయితే మీడియా ఫోకస్ అంతా ఆ పుట్టిన బేబీపై ఉంటుంది అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇటీవల కియారా అద్వానీ తల్లి అయిన సమయంలో అంతకు ముందు ఆలియా భట్ బేబీకి జన్మనిచ్చిన సమయంలో మీడియాలో ఏ స్థాయిలో చర్చ జరిగిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వీరిద్దరి గురించే కాకుండా అంతకు ముందు పలువురు స్టార్ హీరోయిన్స్ డెలివరీ సమయంలోనూ అదే జరిగింది. అయితే ఇప్పుడు కొత్తగా ఒక స్టార్ కపుల్ కిడ్ పుట్టక ముందు నుంచే వార్తల్లో నిలవడం జరిగింది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రీనా కైఫ్ ప్రస్తుతం గర్భంతో ఉన్న విషయం తెల్సిందే. ఆమె భర్త విక్కీ కౌశల్ చేస్తున్న ప్రస్తుత సినిమాల కంటే వారికి పుట్టబోతున్న



బిడ్డ గురించి ఎక్కువ చర్చ జరుగుతోంది. సోషల్ మీడియాలో ఉన్న వారి నుంచి మొదలుకుని జ్యోతిష్యులు, మీడియా వర్గాల వారు, నెంబర్స్ ఆధారంగా లైఫ్‌ను విశ్లేషించే వారు ఇలా చాలా రకాల మంది కత్రీనా కైఫ్ గురించి మాట్లాడుతున్నారు.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com